తెలుగు దినపత్రిక

సిరి

People's Voice వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

22-09-2026

మంగళవారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 224

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక

సిరి People's Voice వార్తపత్రిక

RNI:TGTEL/26/A0381

siridailynews@gmail.com

/siridailynews

@siridailynews

epaper.siridaily.com

విలేకరులు కావలెను

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575

జూరాల ఆయకట్టు పంటలను కాపాడాలి



- రైతుల పక్షాన పోరాడుతున్న నేతల అరెస్టు దుర్మార్గం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

3

వైద్య విద్యార్థిని అకీరాకు కేటీఆర్ ఆర్థిక భరోసా

3

- ఎంబీబీఎస్ చదువుకు రూ.2 లక్షల ఆర్థిక సహాయం

హైదరాబాద్‌కు గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్స్ జోరు

- ఏడాది లక్ష్యం కంటే ముందే 100 గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు
- రికార్డు స్థాయిలో అంతర్జాతీయ సంస్థల కార్యకలాపాల విస్తరణ
- నెట్‌ఫ్లిక్స్, వార్నర్ బ్రదర్స్, అమ్‌జెన్, యూనిలీవర్ సంస్థల ప్రవేశం
- పారదర్శక పాలన, వేగవంతమైన నిర్ణయాలే పెట్టుబడులకు కారణమన్న సీఎం రేవంత్ రెడ్డి
- 'భారత్ ఫ్యూచర్ సిటీ'తో మరిన్ని పెట్టుబడులకు ప్రణాళిక



హైదరాబాద్, సెప్టెంబర్ 21:

తెలంగాణ రాజధాని హైదరాబాద్ గ్లోబల్ పెట్టుబడులకు కీలక కేంద్రంగా ఎదుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది నగరంలో 100 కొత్త గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (GCC)

మిగతా 2వ పేజీలో..



సంక్షిప్తంగా సూపర్..

టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని మొత్తం 21 సర్కిళ్ల లో కొందరు ఆర్టీసియన్లు అధికారుల అండతో సమాంతర వ్యవస్థను నడుపుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా వేగంగా విస్తరిస్తున్న గ్రేటర్ హైదరాబాద్, సంగారెడ్డి పరిధిలోని సర్కిళ్లలో వీరి పెత్తనం మితిమీరిపోయింది. సబ్ డివిజన్లు, సెక్షన్ కార్యాలయాల్లో సామాన్య వినియోగదారులైనా, విద్యుత్ కాంట్రాక్టర్లయినా, ఆఖరికి కొత్తగా వచ్చిన సెక్షన్ ఇంజనీర్లయినా సరే ఈ ఆర్టీసియన్లను ప్రసన్నం చేసుకోవాల్సిన దౌర్భాగ్య స్థితి నెలకొంది. కనెక్షన్ల విస్తరణ, లోడ్ పెంపునకు సంబంధించిన అంచనాలను రూపొందించడం, అందులో లేనిపోని లొసుగులు వెతికి దరఖాస్తుదారులతో ముందుగానే 'రేటు ఫిక్స్' చేయడం వీరి నిత్యకృత్యంగా మారింది. అడిగినంత ముడుపులు సమర్పించకపోతే సాంకేతిక కొర్రీలు పెట్టి ఆన్‌లైన్ దరఖాస్తులను నిర్దాక్షిణ్యంగా రిజెక్ట్ చేస్తున్నారని బాధితులు లబోదిబోమంటున్నారు.

అంతా మేమే..!

ఆఫీసుల్లో అలా.. క్షేత్రస్థాయిలో ఇలా

విద్యుత్ శాఖలో ఆర్టీసియన్ల హవా

అధికారుల ఉదాసీనతతో ఏళ్లుగా పాతుకుపోయిన వైనం

టీజీఎస్పీడీసీఎల్‌లో పతాక స్థాయికి చేరిన వ్యవస్థీకృత అవినీతి

ఇంజనీర్ల నిర్లక్ష్యం.. ఆర్టీసియన్ల చేతుల్లో కీలకమైన 'శాప్' పాస్‌వర్డులు

కొత్త సర్వీసులు, ట్రాన్స్‌ఫార్మర్ల ఎస్టిమేషన్లలో అడ్డగోలు వసూళ్ల పర్వం

లంచం ముట్టకపోతే కొర్రీలు పెట్టి దరఖాస్తుల తిరస్కరణ

సీఎస్‌సీ కేంద్రాలే అడ్డాగా లీకవుతున్న వినియోగదారుల డేటా

సంగారెడ్డి సహా 21 సర్కిళ్లలో ఆర్టీసియన్లదే సమాంతర దర్బార్

తామే పారిశ్రామిక కాంట్రాక్టర్లుగా మారిపోయిన వైనం

నిఘా విభాగం, సిరి న్యూస్:

టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో వ్యవస్థీకృత అవినీతి పరాకాష్టకు చేరింది. సంస్థ ఆర్థిక, సాంకేతిక లావాదేవీలకు గుండెకాయ వంటి అత్యంత కీలకమైన 'శాప్' సాఫ్ట్‌వేర్ కొందరు అధికారుల నిర్లక్ష్యం, బద్ధకం వల్ల దారుణంగా దుర్వినియోగమవుతోంది. విద్యుత్ శాఖలో కొత్త సర్వీసులు, హెచ్‌టీ/ఎల్‌టీ లైన్ల విస్తరణ, వ్యవసాయవాణిజ్య ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు వంటి ఏ సాంకేతిక పనులు జరగాలన్నా క్షేత్రస్థాయిలో పరిశీలించి అంచనాలను రూపొందించి శాప్‌లో నమోదు చేయాల్సిన చట్టబద్ధమైన బాధ్యత అసిస్టెంట్ ఇంజనీర్లు, సబ్ ఇంజనీర్లది. అయితే క్షేత్రస్థాయిలో తిరిగే పనిభారం తప్పుతుందన్న నెపంతో ఇంజనీర్లు తమ అధికారిక లాగిన్ ఐడీలు, రహస్య పాస్‌వర్డ్‌లను సంస్థలో పనిచేస్తున్న ఆర్టీసియన్ల చేతుల్లో పెట్టేశారు. సాంకేతిక పరిజ్ఞానం ఉన్న కొందరు ఆర్టీసియన్లు దీనిని ఆసరాగా చేసుకుని నిబంధనలను తుంగలో తొక్కుతూ అక్రమ దందాలకు తెరలేపారు.



మిగతా 2వ పేజీలో..



తిరుమలేశుని సేవలో డిప్యూటీ సీఎం భట్టి

- సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న విక్రమార్క

3



హెల్త్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా తెలంగాణ

- టెక్నాలజీతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు
- హోమా సీఎంఈ 2026 సదస్సు ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు

2



అక్టోబర్‌లోగా యాతాలకుంట టన్నెల్ పూర్తి

- ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు చర్యలు
- సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలు అందించడమే లక్ష్యం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- కమలాపురం నుంచి అన్నదైవం ప్రాజెక్టుకు నీరు విడుదల

3

అదుపుతప్పి మూసీలోకి దూసుకెళ్లిన బస్సు

- స్కూల్ పిల్లలకు తప్పిన ముప్పు

3

వ్యవసాయ పొలాల్లో కరెంట్ పెద్దసారు!

- నల్గొండ జిల్లాలో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ ఆకస్మిక పర్యటన
- రైతులతో నేరుగా ముఖాముఖి భేటీ
- విద్యుత్ సరఫరా, వోల్టేజ్ పరిస్థితులు, భూగర్భ జలాల వాస్తవ స్థితిపై ఆరా

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 21 (సిరి న్యూస్):

గత నెల రోజులుగా వ్యవసాయానికి విద్యుత్ సరఫరాపై వస్తున్న ఆరోపణలు, రైతులకు కనీసం 7 గంటలు కూడా కరెంట్ అందడం లేదంటూ ప్రతిపక్షాల విమర్శలు వస్తున్న నేపథ్యంలో సీఎండీ జితేష్ వి. పాటిల్ క్షేత్ర స్థాయిలో స్వయంగా రంగంలోకి దిగారు. సోమవారం నల్గొండ జిల్లాలో విస్తృతంగా పర్యటించిన ఆయన..

మిగతా 2వ పేజీలో..



రూ.813 కోట్ల పరిహారం తక్షణం రైతులకు చేరాలి

- భూసేకరణ, పునరావాస చెల్లింపులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి
- ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసేందుకే రూ.6 వేల కోట్లకు సీఎం హామీ
- భూములిచ్చే రైతుల పట్ల న్యాయబద్ధంగా, మానవీయంగా వ్యవహరించాలి

2


- నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి



ట్యూషన్ నుంచి వస్తున్న బాలికపై దారుణం

- జమూయ్‌లో విద్యార్థులను అడ్డగించి బాలికపై లైంగిక వేధింపులు
- బాలికను లాక్కెళ్లేందుకు నిందితుల యత్నం
- ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్
- ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

8



సోనియా ఓటర్ లిస్ట్ కేసులో కీలక మలుపు

- ఎఫ్ఐఆర్‌పై మెజిస్ట్రేట్ ఆదేశాలను కొట్టివేసిన సెషన్స్ కోర్టు
- పిటిషన్‌పై మళ్లీ విచారణ జరపాలని ఆదేశం
- 1980 ఓటర్ జాబితాలో పేరు నమోదుపై ఫిర్యాదు
- 1983లో పౌరసత్వం పొందినట్లు పిటిషనర్ వాదన

8



అంతా మేమే..!

- **బదిలీల ఉత్తర్వులు వచ్చినా పైరవీలతో పాత సీట్లలోనే తిష్ట**
- **ఆర్టీసియన్లకే సొంతంగా ప్రైవేట్ అసిస్టెంట్లు.. దందాల దందా**
- **ఫోకల్ పోస్టుల నుంచి తొలగించి శాఖను ప్రక్షాళన చేయాలి**

కాంట్రాక్టర్ల అవతారమెత్తిన సిబ్బంది

వినియోగదారులు కొత్త విద్యుత్ సర్వీసుల కోసం కస్టమర్ సర్వీస్ సెంటర్లలో దరఖాస్తు చేసుకోగానే, ఆ సమాచారం క్షణాల్లో ఈ అవినీతి ఆర్టీసియన్ల వాట్సాప్‌లకు చేరిపోతోంది. కారణం ప్రతి సీఎస్‌సీ సెంటర్‌లో కంప్యూటర్ ఆపరేటర్లుగా తిష్టవేసింది వీరే కావడమే. దరఖాస్తు అందిన వెంటనే నేరుగా రంగంలోకి దిగి ప్రభుత్వానికి డీడీల రూపంలో చెల్లించాల్సిన అధికారిక ఎస్టిమేషన్ ఖర్చుతో పాటు, పై అధికారుల ఖర్చు అంటూ భారీ మొత్తాలను అదనంగా డిమాండ్ చేస్తున్నారు. తమ చేతికి మట్టి అంటకుండా కమీషన్ల వాటా నేరుగా అందుతుండటంతో పలువురు సెక్షన్ అధికారులు కూడా వీరి చేష్టలను చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. సంగారెడ్డి సర్కిల్ పరిధిలోని ఓ సబ్‌డివిజన్‌లో పని చేస్తున్న ఓ ఆర్టీసియన్ ఏకంగా తానే పారిశ్రామిక కాంట్రాక్టర్‌గా అవతారమెత్తి లక్షల రూపాయలు దండుకుంటున్నాడని స్థానిక కాంట్రాక్టర్లు ఆధారాలతో సహా ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడం వీరి అండదండలకు నిదర్శనం.

దశాబ్దాలుగా ఒకే చోట తిష్ట..

సంస్థలో ఆర్టీసియన్లు దశాబ్దాల తరబడి ఒకే ప్రాంతంలో, కీలక ఫోకల్ పోస్టుల్లో పాతుకుపోవడమే ఈ గుత్తాధిపత్యానికి ప్రధాన కారణం. గతంలో ప్రభుత్వం సాధారణ బదిలీలు చేపట్టినప్పటికీ, కీలక సీట్లలో ఉన్న కొందరు యూనియన్ పైరవీలతో, స్థానిక నాయకుల ఒత్తిళ్లతో అక్కడే తిష్టవేశారు. మరికొందరికి బదిలీ ఉత్తర్వులు వెలువడినా రిలీవ్ కాకుండా, పాత సీట్ల నుంచే చక్రం తిప్పుతూ దందాలు కొనసాగిస్తుండటం విస్మయం కలిగిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 19 వేల మంది ఆర్టీసియన్లు ఉండగా, వీరిలో 16 వేల మంది ఎండనక, వాననక స్తంభాలు ఎక్కుతూ పోల్ టు పోల్, సబ్ స్టేషన్లలో ప్రాణాలకు తెగించి నిజాయితీగా శ్రమిస్తున్నారు. కానీ సర్కిల్, డివిజన్, సబ్ డివిజన్ కార్యాలయాల్లో తిష్టవేసిన కొద్దిమంది అక్రమార్కులు మాత్రం సంస్థ పరువును బజారున పడేస్తూ నెలకు రూ.లక్షల్లో అక్రమార్జనకు తెగబడుతున్నారు.

ఆర్టీసియన్లకే ప్రైవేటు అసిస్టెంట్లు..

గ్రేటర్ హైదరాబాద్ సహా పలు పట్టణ ప్రాంతాల్లో ఆర్టీసియన్ల కింద పనికి అనధికారికంగా ప్రైవేటు సహాయకులు పనిచేస్తుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. క్షేత్రస్థాయిలో సరిపడా రెగ్యులర్ సిబ్బంది లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని, ఆర్టీసియన్లు తమ జేబుల్లోంచి జీతాలిస్తూ సొంతంగా ప్రైవేటు వ్యక్తులను సహాయకులుగా పెట్టుకుంటున్నారు. వారే క్షేత్రస్థాయిలో అసలైన విద్యుత్ ఉద్యోగులమంటూ చలామణి అవుతూ మీటర్ రీడింగులు, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ పరిష్కారం పేరిట ప్రజలను పీడించి వసూళ్లకు పాల్పడుతున్నారు. కనీస భద్రతా పరికరాలు, సాంకేతిక శిక్షణ లేని ఈ ప్రైవేట్ వ్యక్తులు విద్యుత్ స్తంభాలు ఎక్కి తరచూ విద్యుదాఘాతానికి గురై దుర్మరణం పాలవుతున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు అటు డిపార్ట్‌మెంట్ నుంచి ఎలాంటి పరిహారం అందక ఆ నిరుపేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. టీజీఎస్పీడీసీఎల్ యాజమాన్యం తక్షణమే స్పందించి, శాప్ లాగిన్‌లపై ఫోరెన్సిక్ డిజిటల్ ఆడిట్ నిర్వహించాలని, ఫోకల్ పోస్టుల్లో ఉన్నవారిని క్షేత్రస్థాయి పోల్ డ్యూటీలకు బదిలీ చేసి వ్యవస్థను ప్రక్షాళన చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

హెల్త్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా తెలంగాణ

హైదరాబాద్, సెప్టెంబర్ 21 :

దేశంలోనే హెల్త్ ఇన్నోవేషన్స్‌కు ప్రధాన కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఇప్పటికే ఉన్న ఐటీ, ఎమర్జింగ్ టెక్నాలజీస్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాలు, స్టార్టప్‌ల సామర్థ్యాలను హెల్త్ కేర్‌తో సమర్థవంతంగా అనుసంధానం చేసే కాంప్రహెన్సివ్ ఇన్నోవేషన్ ఎకోసిస్టంను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. టీహబ్‌లో 'బయాండ్ నంబర్స్ ప్రెసిషన్ ఫినోటైపింగ్ ఇన్ డయాబెటిస్ అండ్ మెటబాలిక్ కేర్' అంశంపై 'హోమా సీఎంఈ 2026' పేరిట నిర్వహించిన జాతీయ సదస్సును ఆయన సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తమ ప్రభుత్వం కేవలం సాంప్రదాయ వైద్య విధానాలతోనే కాక లైఫ్ స్టైల్ డేటాను విశ్లేషించడం ద్వారా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవకాశముందన్నారు. ఈ తరహా దీర్ఘకాలిక వ్యాధులను ప్రాథమిక దశలో గుర్తించాల్సిన అవసరముందన్నారు. ఆ దిశగా మరిన్ని నూతన ఆవిష్కరణలు రావాలన్నారు. రాబోయే రోజుల్లో హెల్త్ కేర్ రంగంలో ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించే కొత్త ఆలోచనలకు తమ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని మంత్రి శ్రీధర్‌బాబు భరోసానిచ్చారు. ప్రజారోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు వైద్య నిపుణులు, పరిశోధకులు, సంస్థలు ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యుడు ముద్దు సురేంద్ర నెహ్రూ రచించిన 'ది న్యూ పారాడైమ్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అలాగే ప్రపంచంలోనే తొలి ఉచిత మెటబాలిక్ కాలిక్యులేటర్ యాప్ 'మెట్రిక్ ఎక్స్ ప్లోరర'ను ప్రారంభించారు. ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ (పీఓసీ) పేరిట ప్రభుత్వ హాస్పిటల్స్ నుంచి ఎంపిక చేసిన 50మంది రోగులకు ఉచిత ప్రొటోకాల్‌ను అందించే కార్యక్రమానికి కూడా ఆయన శ్రీకారం చుట్టారు.

హైదరాబాద్‌కు గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్స్ జోరు

మొదటిపేజీ తరువాయి

ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకోగా, నిర్దేశిత గడువు కంటే ముందే ఆ లక్ష్యాన్ని చేరుకున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు ఆసక్తి చూపుతున్నాయని పేర్కొన్నారు.

ప్రముఖ సంస్థల విస్తరణ

నెట్‌ఫ్లిక్స్, వార్నర్ బ్రదర్స్, ఆమ్‌జెన్, యూనిలీవర్ వంటి అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్‌ను తమ కీలక కార్యకలాపాల కేంద్రంగా ఎంచుకున్నాయని సీఎం తెలిపారు. రాష్ట్రంలో పారదర్శక పాలన, వేగంగా నిర్ణయాలు తీసుకునే విధానం పెట్టుబడులను ఆకర్షించేందుకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. గ్లోబల్ సంస్థల రాకతో హైదరాబాద్ వాణిజ్య, సాంకేతిక రంగాల్లో మరింత ప్రాధాన్యం సంతరించుకుంటోందన్నారు.

ఫ్యూచర్ సిటీపై దృష్టి

తెలంగాణను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో 'భారత్ ఫ్యూచర్ సిటీ'ని అభివృద్ధి చేస్తున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, ఆధునిక సాంకేతిక వనరులతో ఈ నగరాన్ని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. విదేశీ పెట్టుబడులు, తెలంగాణలోని నైపుణ్య మానవ వనరుల సమ్మేళనంతో రాష్ట్రం దేశ ఆర్థిక ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తోందని సీఎం పేర్కొన్నారు.

22ఏపై ఎన్‌హెచ్‌ఆర్సీ కీలక ఆదేశాలు

- **ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చడంపై స్వతంత్ర విచారణ**
- **తెలంగాణ సీఎస్‌కు జాతీయ మానవ హక్కుల సంఘం ఆదేశం**
- **నాలుగు వారాల్లో చర్యల నివేదిక సమర్పించాలని సూచన**
- **22A జాబితాతో ఆస్తుల రిజిస్ట్రేషన్లలో ఇబ్బందులపై ఫిర్యాదు**
- **రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన అంశాన్ని పరిశీలించిన NHRC**

హైదరాబాద్, సెప్టెంబర్ 21:

తెలంగాణలో 22A నిషేధిత జాబితాలో ప్రైవేట్ వ్యక్తుల భూములను చేర్చిన వ్యవహారంపై జాతీయ మానవ హక్కుల సంఘం (NHRC) కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ అంశంపై స్వతంత్ర విచారణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. విచారణలో తీసుకున్న చర్యలు, పురోగతిపై నాలుగు వారాల్లో నివేదిక సమర్పించాలని సూచించింది.


ఫిర్యాదుపై విచారణ

22A నిషేధిత జాబితా కారణంగా సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది, సామాజికవేత్త కారుపోతుల రేవంత్ సెప్టెంబర్ 14న NHRCకి ఫిర్యాదు చేశారు. ప్రైవేట్ భూములు నిషేధిత జాబితాలో చేరడంతో వాటి రిజిస్ట్రేషన్లు, లావాదేవీలు నిలిచిపోతున్నాయని, బాధితులు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ ఫిర్యాదుపై సోమవారం విచారణ చేపట్టిన NHRC.. 22A జాబితా కారణంగా ప్రజల ఆస్తి హక్కులకు భంగం కలుగుతున్న అంశాన్ని పరిశీలించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, 14, 19(1)(g), 300A కింద ఉన్న హక్కులకు సంబంధించిన అంశాలను పరిగణనలోకి తీసుకుంది.

ఎలా చేర్చారో తేల్చాలి

ప్రైవేట్ వ్యక్తుల భూములు 22A నిషేధిత జాబితాలోకి ఎలా చేరాయి? వాటిని చేర్చే ప్రక్రియలో ఏమైనా లోపాలు చోటుచేసుకున్నాయా? అనే అంశాలపై స్వతంత్రంగా విచారణ జరపాలని NHRC ఆదేశించింది. బాధితులకు అవసరమైన ఉపశమనం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించింది. ఇటీవల రాష్ట్రంలో 22A నిషేధిత జాబితాలో ప్రైవేట్ భూములు, కొన్ని నివాస ప్రాంతాలు చేరడంపై ఫిర్యాదులు, వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. సెక్షన్ 22A కింద నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించిన పెండింగ్ కేసులను పరిశీలించి పరిష్కరించే బాధ్యతను కమిటీకి అప్పగించింది. తాజాగా NHRC ఆదేశాలతో ఈ వ్యవహారంపై విచారణ, తదుపరి చర్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి



రూ.813 కోట్ల పరిహారం తక్షణం రైతులకు చేరాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 21 :

భూసేకరణ, పునరావాసంపునర్వ్యవస్థీకరణకు ఇప్పటికే విడుదల చేసిన రూ.813 కోట్లను ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత రైతులకు అందించాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లా కలెక్టర్లు, నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. నిధులు విడుదలైనప్పటికీ అవి ప్రభుత్వ ఖాతాల్లోనే ఉండిపోవడం, మరోవైపు భూసేకరణ పూర్తికాక ప్రాజెక్టులు నిలిచిపోవడం ఎంతమాత్రం సమంజసం కాదని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాసంపునర్వ్యవస్థీకరణ పనులు, పరిహారం చెల్లింపుల పురోగతిపై సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇప్పటివరకు భూసేకరణ, పునరావాసం పునర్వ్యవస్థీకరణకు సంబంధించి రూ.3,101 కోట్ల విలువైన టోకెన్లు సమర్పించగా ప్రభుత్వం రూ.2,504 కోట్లు విడుదల చేసినట్లు అధికారులు వివరించారు. ప్రస్తుతం జిల్లాస్థాయిలో చెల్లింపులకు పెండింగ్‌లో ఉన్న రూ.813 కోట్లలో రూ.502 కోట్లు భూసేకరణ అధికారుల వద్ద, మరో రూ.311 కోట్లు కలెక్టర్ల వద్ద ఉన్నట్లు తెలిపారు. ఈ పరిస్థితిపై మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిధులు విడుదలైన తరువాత అవి తప్పనిసరిగా భూములు కోల్పోయిన రైతులకు చేరాల్సిందేనని స్పష్టం చేశారు. కలెక్టర్లు చొరవ తీసుకుని రైతులతో సంప్రదింపులు జరపడంతోపాటు అవార్డుల ప్రక్రియను పూర్తి చేసి పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని ఆదేశించారు. 'ప్రభుత్వం విడుదల చేసిన డబ్బు భూములు కోల్పోయిన రైతులకు చేరాల్సిందే.. ఏదైనా వాస్తవమైన కారణంతో చెల్లించడం సాధ్యం కాకపోతే అందుకు గల కారణాన్ని స్పష్టంగా తెలియజేసి నిధులను తిరిగి ప్రభుత్వానికి పంపాలి.. అంతేగాని నెలలతరబడి ఖాతాల్లో నిరుపయోగంగా ఉంచడానికి వీల్లేదు అని మంత్రి స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాసం, అటవీ అనుమతులకు సంబంధించిన అవసరాల కోసం 2026లో రూ.6 వేల కోట్లు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రాధాన్య ప్రాజెక్టుల పనులు నిధుల కొరతతో ఆలస్యం కాకూడదన్న ఉద్దేశంతోనే ఈ మొత్తాన్ని నీటిపారుదల శాఖ సాధారణ బడ్జెట్‌కు అదనంగా సమకూరుస్తున్నట్లు తెలిపారు.

రైతుల పట్ల మానవీయంగా వ్యవహరించాలి

భూములు కోల్పోతున్న రైతుల పట్ల అధికారులు న్యాయబద్ధంగా, మానవీయంగా వ్యవహరించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. అవార్డులు జారీ చేసి చెల్లింపులకు అన్ని ఏర్పాట్లు పూర్తయిన తరువాతే టోకెన్లు సమర్పించాలని స్పష్టం చేశారు. రైతుల భూములను తీసుకునే విషయంలో ప్రభుత్వం అన్యాయం చేయబోదు.. చట్టపరమైన నిబంధనలు, నిర్దేశిత ప్రక్రియకు లోబడి సాధ్యమైనంత వరకు మార్కెట్ ధరలకు దగ్గరగా పరిహారం అందించాలని మంత్రి పేర్కొన్నారు. అవార్డు ప్రకటించిన తరువాత కూడా పరిహారం చెల్లింపులు ఆలస్యమైన కేసుల్లో నిబంధనల ప్రకారం రైతులకు వడ్డీ చెల్లించాలని ఆదేశించారు. కోర్టు కేసులు, యాజమాన్య వివాదాల కారణంగా నిలిచిన భూసేకరణ కేసులన్నింటినీ ప్రత్యేకంగా నమోదు చేసి అడ్వొకేట్ జనరల్‌తో చర్చించి వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

జిల్లాలవారీగా సమస్యలపై సమీక్ష

నల్గొండ, యాదాద్రి భువనగిరి, నారాయణపేట, సిద్దిపేట, వికారాబాద్, జగిత్యాల, హనుమకొండ తదితర జిల్లాల్లో భూసేకరణకు ఎదురవుతున్న సమస్యలను మంత్రి సమీక్షించారు. నల్గొండ జిల్లాలోని చింతపల్లి రిజర్వాయర్, పెండ్లిపాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఉదయసముద్రం, నెల్లికల్లు ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణలో జాప్యంపై ఆరా తీశారు.

వ్యవసాయ పొలాల్లో కరెంట్ పెద్దసారు!

- **సరఫరాను మరింత మెరుగుపరచాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు**

మొదటిపేజీ తరువాయి

ఏకంగా వ్యవసాయ పొలాల్లోకి వెళ్లి రైతులతో నేరుగా ముఖాముఖి మాట్లాడారు. అసలేం జరుగుతోందనే వాస్తవ పరిస్థితిని నేరుగా తెలుసుకునేందుకు ప్రయత్నించారు. ఒక ఐఏఎస్ అధికారి స్వయంగా పొలంలోకి వచ్చి కరెంట్ ఎలా వస్తోంది, ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.

వివిధ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు

మునుగోడు నియోజకవర్గం చౌటుప్పల్ సెక్షన్ పరిధిలోని 33/11 కేవీ జైకేసారం సబ్‌స్టేషన్‌ను సందర్శించి, వ్యవసాయ విద్యుత్ సరఫరా, ఫీడర్ల పనితీరు, లోడ్ పరిస్థితులపై అధికారులతో సమీక్ష జరిపారు. నకిరేకల్ నియోజకవర్గం చిట్యాల మండలం ఆరెగూడెం సబ్‌స్టేషన్‌ను పరిశీలించిన అనంతరం.. సమీపంలోని వరి పొలాల్లోకి వెళ్లి రైతులతో మాట్లాడారు. విద్యుత్





సమయాలు, వోల్టేజ్, మోటార్ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. నల్గొండ నియోజకవర్గం తిప్పర్తి మండలం కేశరాజుపల్లి గ్రామంలో బోర్‌వెల్స్ ద్వారా సాగునీటి ప్రవాహాన్ని పరిశీలించి, పొలాల్లోనే రైతులతో సమావేశమయ్యారు. భూగర్భ జలాలు, పంటల సాగు పరిస్థితులపై చర్చించారు. మిర్యాలగూడ నియోజకవర్గం మాడుగులపల్లి మండలంలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌ను సందర్శించి నెట్‌వర్క్ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. దామరచర్ల థర్మల్ ప్లాంట్ యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను సందర్శించి విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, నిర్వహణ చర్యలపై అధికారులతో చర్చించారు.

కలెక్టర్‌తో ప్రత్యేక సమావేశం..

జిల్లా పర్యటనలో భాగంగా నల్గొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ బడుగుతో సీఎండీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జిల్లాలో విద్యుత్ సరఫరా, వ్యవసాయ అవసరాలు, పెరుగుతున్న డిమాండ్, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై సమగ్రంగా సమీక్షించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం, విద్యుత్ శాఖ సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తున్నామని, రైతుల నుంచి వచ్చే ప్రతి సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను సీఎండీ ఆదేశించారు. ఈ పర్యటనలో ఆయన వెంట రూరల్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి, నల్గొండ ఎస్ఈ ఎ.శ్రీనివాసులు, డివిజనల్ ఇంజనీర్లు, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఎర్రవల్లిలో కొనసాగిన భూ సర్వే

మర్కుక్, సెప్టెంబర్ 21 :

మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో సర్వే నంబర్ 325లో గల 388.05 గుంటల ప్రభుత్వ భూమిపై చేపట్టిన సమగ్ర భూ సర్వే సోమవారం కూడా కొనసాగింది.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ,రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఎర్రవల్లి గ్రామంలో సర్వే నంబర్ 325లో సాగు చేస్తున్న వంద మంది రైతులకు తొలి విడత నోటీసులు జారీ చేసి,సోమవారం తమ భూముల హద్దులు చూపించాలని ఆదేశించడంతో రైతులు ఉదయం నుంచే తమ పట్టాదార్ పాస్ బుక్ లు నోటీసులు,ఇతర రెవెన్యూ రికార్డులతో తమ భూముల వద్దకు చేరుకున్నారు.ఏడీ సుదర్శన్ రాథోడ్,డీఐ సేవ్య నాయక్ ఆధ్వర్యంలో నాలుగు బృందాలుగా ఏర్పడిన సర్వే అధికారులు రైతులు చూపిస్తున్న హద్దుల ప్రకారం,రెవెన్యూ రికార్డుల ప్రకారం కొలతలు చేపట్టి వివరాలను నమోదు చేశారు.సోమవారం నాటికి సుమారు 70ఎకరాల వరకు సర్వే పూర్తి అయినట్లు అధికారులు తెలిపారు.ఎర్రవల్లి గ్రామంలో కొనసాగుతున్న సర్వేను రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ శమీనా బేగం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె సర్వే పనులు జరుగుతున్న తీరును,భూముల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.సర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా కచ్చితమైన కొలతలతో,పారదర్శకంగా నిర్వహించాలని ఆమె అధికారులకు సూచించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని,అందరికీ న్యాయం జరిగేలా సర్వే చేయాలని ఆమె ఆదేశించారు.అలాగే సోమవారం రోజున మరో 50 మంది రైతులకు నోటీసులు జారీ చేశామని అధికారులు తెలిపారు. గత మూడు రోజులుగా ఈ భూమికి హద్దులు ఏర్పాటు చేస్తున్న అధికారులు ప్రస్తుతం ఎవరి భూమి ఎంత ఉంది, ఎంత ఆక్రమణలో ఉంది.. ఎంత ఖాళీగా ఉంది అనే అంశాలపై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తున్నారు.



మా భూమి అంతా పాండురంగ చెరువులో పోయింది

కాగా, ఈ సర్వేలో రైతుల ఆవేదన కూడా బయటపడింది. ఇదే సర్వే నంబర్ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా పాండురంగ చెరువును నిర్మించారని, ఆ చెరువు నిర్మాణంలో రైతులు ఏళ్లుగా సాగు చేసుకుంటున్న దాదాపు 80 ఎకరాల సాగు భూమి పూర్తిగా కోల్పోయామని రైతులు వాపోతున్నారు. తద్వారా పండించుకునే భూమే లేకుండా పోయిందని.. ఇప్పుడు అదే భూములకు తమకు నోటీసులు రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని అంటున్నారు. 'మా భూమి అంతా పాండురంగ చెరువులో పోయింది.. ఇప్పుడు మాకు నోటీసులు వచ్చాయి.. భూమే లేనప్పుడు మేము అధికారులకు ఏ భూమి చూపించాలం'టూ కొంతమంది రైతులు అధికారులను, సర్వేయర్లను ప్రశ్నిస్తున్నారు. శనివారం నోటీసులు అందుకుని సోమవారం పొలాల వద్దకు వచ్చిన రైతులు తమ భూములు చెరువు నీటిలో కలిసిపోయాయని, చూపించడానికి తమ వద్ద భూమే లేదని కన్నీటితో సమాధానమిచ్చారు. పాండురంగ చెరువు నిర్మాణంతో నష్టపోయిన తమకు న్యాయం చేయాలని, తమ భూములకు సరైన పరిహారం కల్పించాలని లేదా ప్రత్యామ్నాయ భూమిని చూపించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సర్వే పూర్తయ్యాక నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించి తదుపరి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు

జూరాల ఆయకట్టు పంటలను కాపాడాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 21 :

కళ్లముందే పంటలు ఎండిపోయి అల్లాడుతున్న అన్నదాతల గోసను ప్రభుత్వం తీర్చాల్సిందిపోయి న్యాయమైన డిమాండ్‌తో నిరసనకు సిద్ధమైన బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు రేవంత్ సర్కారు కుట్ర చేస్తోందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక ప్రకటనలో మండిపడ్డారు. మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, సి.లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నాయకులను అక్రమంగా నిర్బంధించడం రేవంత్ రాక్షస మనస్తత్వానికి నిదర్శనమన్నారు. తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికే జిల్లాలోని అనేక మండలాల్లో బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలకు చీకటి ఆదేశాలిచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూరాలలో తొమ్మిది టీఎంసీల నీటి లభ్యత ఉన్నా విడుదల చేయకుండా కుంటిసాకులతో రేవంత్ సర్కారు పంటల ఉసురు తీస్తోందన్నారు. తమ పంటలను కాపాడుకునే తపనతో గుండెపగిలిన రైతులు జూరాల గేట్లు ఎత్తే ప్రయత్నం చేస్తే వారిపై అక్రమ కేసులు బనాయించిన ప్రభుత్వం అన్నదాతలను అన్ని విధాలా అరిగోస పెడుతోందని ఆయన విమర్శించారు. తెలంగాణ గడ్డపై ఉన్న జూరాల ప్రాజెక్టు పరిసరాల్లోకి రైతులు రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి వందలాదిమంది పోలీసులను మోహరించడం ముమ్మాటికీ సిగ్గుమాలిన చర్య అని అన్నారు. తాగునీటికి కేవలం రెండు టీఎంసీలు సరిపోతాయని తెలిసినా తొమ్మిది టీఎంసీలు ఉన్న జూరాల నుంచి చుక్క నీరు విడుదల చేయకుండా ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టు రైతులను సంక్షోభంలోకి నెట్టడం క్షమించరాని పాపం అని అన్నారు. అరెస్టు చేసిన తమ నేతలను విడుదల చేయడంతోపాటు జూరాల ఆయకట్టు రైతులకు వెంటనే నీరు విడుదల చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. లేకపోతే అన్నదాతల ఆగ్రహానికి ఈ కాంగ్రెస్ సర్కారు కుప్పకూలడం ఖాయం అని కేటీఆర్ హెచ్చరించారు.

నీళ్లివ్వాలని అడిగితే అరెస్టు చేస్తారా? : హరీష్‌రావు

రైతుల పక్షాన పోరాడుతున్న తమ పార్టీకి చెందిన మాజీ మంత్రులు, ఇతర నాయకులను అక్రమంగా నిర్బంధించడం దుర్మార్గం అని శాసన సభలో బీఆర్ఎస్ ఉపనాయకుడు టి.హరీష్‌రావు ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా జలాలను శ్రీశైలం నుండి 738 కి.మీ దూరంలో ఉన్న పెన్నా బేసిన్‌లోని కుప్పం వరకు తరలిస్తుంటే పక్కనే ఉన్న పాలమూరుకు మాత్రం ఎందుకు తరలించడం లేదు అని ప్రశ్నించారు. ఇది కాంగ్రెస్ పాలనా వైఫల్యం కాదా.. పాలకుల చేతగానితనం కాదా.. అని నిలదీశారు. పాలమూరు ప్రాజెక్టులో భాగంగా నార్లపూర్, ఏదుల, కరివెన, వట్టెం కలిపి మొత్తం 50 టీఎంసీల సామర్థ్యంతో జలాశయాలను కేసీఆర్ నిర్మిస్తే వాటిని నీళ్లతో నింపే సోయి కూడా మీకు లేదా అని ఆయన ప్రశ్నించారు. గత రెండున్నరేళ్లు కృష్ణానదిలో పుష్కలంగా నీళ్లు పారినా ఎందుకు మోటర్లను నడపలేదు.. శ్రీశైలం నిండు కుండలా ఉన్నా రైతులకు నీళ్లు ఎత్తిపోసే ఆలోచన ఎందుకు చేయలేదు.. కృష్ణా జలాలను ఏపీకి వదిలిపెట్టి తెలంగాణ రైతుల ప్రయోజనాలను ఎందుకు గాలికొదిలేశారు అని నిలదీశారు. ముఖ్యమంత్రి గానీ, నీళ్ల మంత్రిగాని దీనికి సమాధానం చెప్పాలన్నారు. పాలమూరు ప్రాజెక్టును పడావు పెట్టి రైతుల నోట్లో మట్టి కొట్టారన్నారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే రేవంత్ రెడ్డి పాలమూరు రైతులకు చేస్తున్న నమ్మకద్రోహం ఇది అని హరీష్‌రావు మండిపడ్డారు. రైతులంటే ఎందుకు అంత నిర్లక్ష్యం రేవంత్ రెడ్డీ అని ప్రశ్నించారు. జూరాల ప్రాజెక్టు ఆనకట్ట పరిసరాల్లో పోలీసు బలగాలను భారీగా మోహరించారని, కనిపిస్తే అరెస్టులు చేస్తున్నారని, ఎందుకింత దౌర్జన్యం అని అడిగారు. రైతులు నీళ్లు అడుగుతుంటే వాళ్ల చేతికి సంకెళ్లు వేస్తారా అని ఆయన అడిగారు. తప్పు మీరు చేస్తే శిక్ష రైతులు అనుభవించాలా ఆయన అన్నారు. ఎల్‌నినో సాకు చెప్పి పంటలకు నీళ్లు ఇవ్వాల్సిన బాధ్యత నుంచి తప్పించుకుంటున్నారని, పంట పొలాలకు నీళ్లు ఇవ్వడం చేతగాని ప్రభుత్వం ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సిగ్గుచేటు అని విమర్శించారు. జూరాల ఆయకట్టు రైతులకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని, అదుపులోకి తీసుకున్న తమ పార్టీ నాయకులను, రైతులను విడుదల చేయాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు.

ఖేలో ఇండియా గేమ్స్‌కు ఘనంగా ఏర్పాట్లు

- **క్రీడా వేదికలు, వసతి, రవాణా, భద్రతపై మంత్రి వాకిటి సమీక్ష**

హైదరాబాద్ సెప్టెంబర్ 21 :

రాష్ట్రంలో ఈ ఏడాది డిసెంబర్ 11 నుండి 23వ తేదీ వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 పోటీలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో పోటీల ఏర్పాట్లపై సచివాలయంలో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సోమవారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను శాఖల వారీగా మంత్రి సమీక్షించారు. క్రీడా వేదికల సంసిద్ధత, మౌలిక సదుపాయాల కల్పన, క్రీడాకారుల వసతి, రవాణా, భద్రత, వైద్య సదుపాయాలు, ఆహారం, పరిశుభ్రత, స్వాగత ఏర్పాట్లు, ప్రచార కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే యువ క్రీడాకారులకు అత్యుత్తమ వసతులు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రతి క్రీడా వేదికలో అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని, పోటీల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఖేలో ఇండియా గేమ్స్ వంటి జాతీయస్థాయి పోటీలు రాష్ట్రంలో యువ క్రీడాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు మరిన్ని అవకాశాలను కల్పిస్తాయని మంత్రి పేర్కొన్నారు. క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేయడంతోపాటు గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. తెలంగాణ ఆతిథ్యానికి, క్రీడా రంగంలో రాష్ట్ర ప్రతిష్ఠకు తగిన స్థాయిలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహించేందుకు అధికారులు సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు. సమీక్షలో ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఎండీ సోని బాలదేవి, క్రీడా శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఎల్‌నినో యాక్షన్ ప్లాన్‌పై అక్టోబర్ 2న తీర్మానాలు

- **ప్రతి గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దాలి**
- **పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**

హైదరాబాద్, సెప్టెంబర్ 21 :

ఎల్‌నినో ప్రభావంతో రానున్న కాలంలో ఎదురయ్యే పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు గ్రామస్థాయిలో పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ఖైరతాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అక్టోబర్ 2న నిర్వహించనున్న గ్రామ సభలు, ఎల్‌నినో నేపథ్యంలో గ్రామాల వారీగా చేపట్టాల్సిన పనులు, పంచాయతీల్లో అమలు చేయాల్సిన అభివృద్ధి ప్రణాళికపై మంత్రి సమీక్షించారు. సమావేశానికి స్పెషల్ సీఎస్ దానకిషోర్, అడిషనల్ కమిషనర్ పి.రవీందర్‌తోపాటు శాఖకు చెందిన ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని యాక్షన్ ప్లాన్‌పై అసెంబ్లీలో చర్చించి తీర్మానం చేశామని చెప్పారు. అక్టోబర్ 2న ప్రతి గ్రామ పంచాయతీలో నిర్వహించే గ్రామ సభల్లో ఎల్‌నినో యాక్షన్ ప్లాన్‌పై చర్చించి గ్రామ స్థాయిలో అవసరమైన చర్యలపై తీర్మానాలు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామానికి అవసరమైన పనులు ఏమిటి.. అందుబాటులో ఉన్న నిధులు ఎంత.. వచ్చే ఏడాది కాలంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా గ్రామ పంచాయతీలకు అందే నిధులు ఎంత అనే అంశాలపై గ్రామ సభల్లో సమగ్రంగా చర్చించి గ్రామ అవసరాలకు అనుగుణంగా కార్యాచరణను ఆమోదించాలని మంత్రి సూచించారు.



అక్టోబర్‌లోగా యాతాలకుంట టన్నెల్ పూర్తి

దమ్మపేట, సెప్టెంబర్ 21 :

శ్రీ సీతారామ ప్రాజెక్టు ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలను అందించి రైతులకు సాగునీటి భరోసా కల్పించేందుకు పనులను వేగవంతం చేస్తున్నామని వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సత్తుపల్లి మండలం యాతాలకుంట వద్ద సీతారామ ప్రాజెక్టు టన్నెల్ పనులను అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌లతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. టన్నెల్ కింది భాగంలో ఉన్న ఖాళీలను కాంక్రీట్‌తో పటిష్టంగా నింపాలని, గ్రౌటింగ్, ప్యాకింగ్, కాంక్రీట్ పనులను సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. నాణ్యత, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి జాప్యానికి తావులేకుండా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. టన్నెల్ పనులను 25 రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు మంత్రికి వివరించారు. అక్టోబరులో పనులు పూర్తి చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. టన్నెల్ లైనింగ్, కెనాల్ లైనింగ్, రోడ్ క్రాసింగ్స్ తదితర మిగిలిన పనులను సమన్వయంతో వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. అనంతరం ములకలపల్లి మండలం కుమ్మరిపాడులో ఎస్‌టీఎస్‌డీఎఫ్ నిధులు రూ.4.63 కోట్ల అంచనాతో నిర్మించిన హై లెవల్ బ్రిడ్జి, బీటీ రోడ్డును మంత్రి తుమ్మల ప్రారంభించారు. గ్రామీణ ప్రజలకు రాకపోకలు సులభతరం చేయడంతోపాటు అన్ని కాలాల్లో రవాణా సౌకర్యం అందుబాటులో ఉండేలా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. తదుపరి ములకలపల్లి మండలం కమలాపురంలో సీతారామ ఎత్తిపోతల పథకంలోని మూడో పంప్‌హౌస్‌ను ఎమ్మెల్యే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి పరిశీలించి మోటార్‌ను ఆన్ చేసి అన్నదైవం ప్రాజెక్టుకు నీటిని విడుదల చేశారు. సాగు అవసరాలకు అనుగుణంగా నీటిని సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీతారామ ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలను అందించాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిల లక్ష్యమని తెలిపారు. పనుల్లో తొందరపాటు కంటే నాణ్యత, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పటిష్టంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. టన్నెల్ లైనింగ్, కెనాల్ లైనింగ్, రోడ్ క్రాసింగ్స్ తదితర పనులను వేగవంతం చేసి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించామని తెలిపారు. భూసేకరణ సమస్యలను దాదాపుగా పరిష్కరించామని ఆయన తెలిపారు. భూసేకరణ కోసం ఇటీవల రూ.48 కోట్లు విడుదల చేశామని, ఇంకా అవసరమైన భూముల కోసం కలెక్టర్ ప్రతిపాదనలు పంపితే నిధులను సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. వర్షాలు లేకపోవడం వల్ల భూగర్భ జలాలు కూడా తగ్గుతున్నాయని, ఈ పరిస్థితుల్లో ఖరీఫ్ పంటలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. సాగు చేసిన పంటలకు అవసరమైన సమయంలో నీటిని అందించేందుకు గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. నీటి లభ్యతను ముందుగానే అంచనా వేసుకుని ఏ ప్రాంతానికి ఎంత నీరు అవసరమో ప్రణాళిక రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నీటి నిల్వలు తగ్గితే జల విద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం ఉంటుందని, అదే సమయంలో వ్యవసాయం, పరిశ్రమలు, గృహ వసరాల కోసం విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని చెప్పారు. జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గినప్పుడు థర్మల్ విద్యుత్‌పై ఎక్కువగా ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. సీతారామ ద్వారా ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట ప్రాంతాల్లో కూడా సాగునీటి అవసరాలను తీర్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యంగా దమ్మపేట, అశ్వారావుపేట ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆయిల్‌పామ్ సాగు జరుగుతున్నందున సాగునీటి సౌకర్యం మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. నాలుగో పంప్‌హౌస్ ద్వారా అవసరమైన ప్రాంతాలకు నీటిని తీసుకెళ్లేలా పనులను వేగవంతం చేయాలని మంత్రి తెలిపారు. ప్రధాన కాల్వలతోపాటు అవసరమైనచోట్ల పైప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తే భూసేకరణ సమస్యలు తగ్గుతాయని, నీటిని నేరుగా రైతుల పొలాలకు తీసుకెళ్లే అవకాశం ఉంటుందని చెప్పారు. పైప్‌లైన్‌తోపాటు డ్రిప్, స్ప్రింక్లర్ విధానాలను ప్రోత్సహించడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించవచ్చని, తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. సీతారామ పనులపై కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు వారానికోసారి సమీక్ష నిర్వహించాలని, ఎక్కడా పనులు నిలిచిపోకూడదని, ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే జిల్లా స్థాయిలో పరిష్కరించాలని మంత్రి సూచించారు. అవసరమైన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ములకలపల్లి ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం

ములకలపల్లి ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. రహదారులు, మండల కార్యాలయాలు, గురుకులాలు, ఏకలవ్య పాఠశాలలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్ తదితర మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. అన్నదైవం ప్రాజెక్టుకు నీటిని విడుదల ద్వారా ఈ ప్రాంత రైతులకు సాగునీటి ప్రయోజనం కల్పించే దిశగా మరో అడుగు ముందుకు వేసినట్లు మంత్రి తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మెరుగైన రవాణా సౌకర్యాలు, పారిశ్రామిక, వ్యవసాయ అభివృద్ధికి విమానాశ్రయం, రైల్వే అనుసంధానం వంటి మౌలిక వసతులు అవసరమని అన్నారు. విమానాశ్రయానికి సంబంధించి సాధ్యాసాధ్యాల నివేదిక సిద్ధమైన అనంతరం తదుపరి చర్యలు చేపడతామని చెప్పారు. రైల్వే అనుసంధానానికి సంబంధించి పాండురంగాపురంమణుగూరు మార్గం, భద్రాచలం వైపు రైల్వే విస్తరణ అంశాలపై కూడా కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమాల్లో ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



వైద్య విద్యార్థిని అకీరాకు కేటీఆర్ ఆర్థిక భరోసా

- **ఎంబీబీఎస్ చదువుకు రూ.2 లక్షల ఆర్థిక సహాయం**

హైదరాబాద్, సెప్టెంబర్ 21:

ఆర్థిక ఇబ్బందులతో వైద్య విద్యను కొనసాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న వరంగల్ జిల్లా వర్ధన్నపేటకు చెందిన కొండేటి అకీరాకు కేటీఆర్ అండగా నిలిచారు. ఎంబీబీఎస్ విద్యను కొనసాగించేందుకు రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు. వర్ధన్నపేట పట్టణానికి చెందిన కొండేటి భాస్కర్, అనిత దంపతుల కుమార్తె అకీరా. తుర్రూరులోని సాంఘిక సంక్షేమ పాఠశాలలో పదో తరగతి, ఖమ్మంలోని అంబేద్కర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసిన అకీరా జాతీయ వైద్య ప్రవేశ పరీక్షలో అఖిల భారత స్థాయిలో 2,99,946 ర్యాంకు, ఎస్సీ విభాగంలో 27,865 ర్యాంకు సాధించింది. అనంతరం పటాన్‌చెరువులోని మహేశ్వర వైద్య కళాశాలలో ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందింది. అకీరా వైద్య విద్యకు సంబంధించిన ఆర్థిక ఇబ్బందుల విషయాన్ని జర్నలిస్ట్ బొల్లెపాక రాజేష్ ట్విట్టర్ ద్వారా కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న కేటీఆర్ స్పందించి అకీరా చదువుకు ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం సోమవారం తెలంగాణ భవన్‌లో అకీరాకు రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని కేటీఆర్ అందజేశారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా అండగా ఉంటానని పేర్కొంటూ, అకీరా భవిష్యత్తులో వైద్యురాలిగా ఎదగాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా అకీరా వైద్య విద్య పూర్తయ్యే వరకు భవిష్యత్తులోనూ అండగా ఉంటానని కేటీఆర్ హామీ ఇచ్చారు. కేటీఆర్ అందించిన ఆర్థిక సహాయంతో తన వైద్య విద్యను కొనసాగించేందుకు మరింత ధైర్యం వచ్చిందని అకీరా తెలిపింది. తన చదువుకు అండగా నిలిచిన కేటీఆర్‌కు అకీరా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

తిరుమలేశుని సేవలో డిప్యూటీ సీఎం భట్టి

- **సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న విక్రమార్క**

తిరుమల, సెప్టెంబర్ 21 :

తిరుమల తిరుపతి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క ఆదివారం రాత్రి ఉత్సవాల్లో పాల్గొని సోమవారం తెల్లవారుజామునల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న డిప్యూటీ సీఎంకు తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) అధికారులు స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ మండపంలో వేద పండితులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వేదాశీర్వచనం చేశారు. అనంతరం అధికారులు స్వామివారి శేష వస్త్రంతో ఆయనను సత్కరించి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.



అదుపుతప్పి మూసీలోకి దూసుకెళ్లిన బస్సు

- **స్కూల్ పిల్లలకు తప్పిన ముప్పు**

హైదరాబాద్,, సెప్టెంబర్ 21 :

రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో స్కూల్ బస్సు అదుపుతప్పి మూసీ నదిలోకి దూసుకెళ్లిన సంఘటన సోమవారం జరిగింది. దీంతో బస్సులోని చిన్నారులు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. త్రుటిలో పెను ప్రమాదం తప్పడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, సంబంధిత అధికారులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. స్కూల్ బస్సు రోడ్డుపై నుంచి అదుపుతప్పి మూసీ నదిలోకి దూసుకెళ్లడంతో ఆ మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. బస్సును అక్కడి నుంచి తొలగించేందుకు చర్యలు చేపట్టడంతోపాటు ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యమా లేక మరేదైనా కారణమా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

నేడు జూరాలను సందర్శించనున్న బీజేపీ బృందం

హైదరాబాద్, సెప్టెంబర్ 21 :

జూరాల ప్రాజెక్టులోని నీటిమట్టాన్ని పరిశీలించి రైతుల సమస్యలను తెలుసుకునేందుకు తన నేతృత్వంలోని బీజేపీ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం మంగళవారం జూరాల ప్రాజెక్టును సందర్శించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు తెలిపారు. ప్రజల సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే బీఆరఎస్, కాంగ్రెస్‌లు డ్రామాలు ఆడుతున్నాయని విమర్శించారు. వరంగల్‌కు చెందిన ఐటీడీఏ ప్రాజెక్టు విశ్రాంత అధికారితోపాటు పలువురు ప్రముఖులకు పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పంటలను కాపాడేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసేలా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక నాయకుల మధ్య వివాదాలు, సరైన సమన్వయం లేకపోవడం వల్ల దిగువ ప్రాంత రైతులు నష్టపోతున్నారన్నారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంతో మాట్లాడి ఆలమట్టి, నారాయణపూర్ డ్యామ్‌ల నుంచి నీటి విడుదలను తెలంగాణ ప్రభుత్వం నిర్ధారించుకోవాలని కోరారు. ఫామ్‌హౌస్ వివాదాల్లో కేసులు ఎందుకు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. వినాయక నిమజ్జన ఊరేగింపు ఏర్పాట్లకు పోలీసు బలగాలను ఉపయోగించకుండా ఎర్రవల్లి ఫామ్‌హౌస్ చుట్టూ మోహరించి ప్రభుత్వం పోలీసు శాఖను దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యుల అరెస్టును తీవ్రంగా ఖండించారు. సంప్రదాయం ప్రకారం హుస్సేన్‌సాగర్‌లో గణేష్ విగ్రహాల నిమజ్జనానికి అనుమతితోపాటు అన్ని ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. 70 అడుగుల ఎత్తైన విగ్రహాలు సహా భారీ విగ్రహాలను బ్యాక్‌వాటర్‌కు మళ్లించకుండా ట్యాంక్‌బండ్‌లోనే నిమజ్జనం చేయడానికి అనుమతించాల్సిందేనని స్పష్టం చేశారు.

ఆరూరు గ్రామ ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడమే తమ లక్ష్యం





- **ఆరూర్ గ్రామంలో భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభం.**
- **గ్రామ సర్పంచ్ నాయకోటి లావణ్య మధు.**

సదాశివపేట. సెప్టెంబర్ 21.(సిరి న్యూస్)

సదాశివపేట మండలంలోని ఆరూర్ గ్రామపంచాయతీ పరిధిలో భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభమయ్యాయి. గ్రామ సర్పంచ్ నాయకోటి లావణ్య మధు భూమిపూజ నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించడంతో పాటు, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం లక్ష్యంగా ఈ పనులను చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. ఇప్పటివరకు వర్షాకాలంలో మురుగునీరు నిలిచి పోవడం, ఇళ్ల పరిసరాల్లో దుర్వాసన వ్యాపించడం, దోమల బెడద పెరగడం వంటి సమస్యలను గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్నారని ఆమె పేర్కొన్నారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులోకి వస్తే మురుగునీటిని సక్రమంగా తరలించడంతో పాటు, రహదారులు, వీధులు, నివాస ప్రాంతాల్లో పరిశుభ్రత మెరుగుపడుతుందని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఈ ప్రాజెక్టు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆమె అన్నారు. పనుల ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామ సర్పంచ్, పంచాయతీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. భూగర్భ డ్రైనేజీ నిర్మాణంలో ఉపయోగించే పైపులు, పనుల సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రహదారుల పునరుద్ధరణ, తాత్కాలిక మార్గాల ఏర్పాటు వంటి చర్యలు చేపట్టాలని వారు సూచించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మ్యాదరి విట్టల్, భరత్ కుమార్, భాగ్యలక్ష్మి, అంజయ్య, మన్నె నాగేష్, పద్మ, భారతమ్మ, లక్ష్మి, రమేష్, నాగేష్, గ్రామ పెద్దలు, మాజీ సర్పంచ్ నాయికోటి మధు మణయ్య, మల్లికార్జున్, సంకి నర్సింలు, నారాయణ తదితరులు పాల్గొన్నారు. భూగర్భ డ్రైనేజీ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, పారదర్శకంగా చేపడతామని పంచాయతీ కార్యదర్శి మల్లేశం గౌడ్ తెలిపారు.

పనుల పురోగతిని
ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. డ్రైనేజీ వ్యవస్థ పూర్తయిన తర్వాత దాని నిర్వహణ, శుభ్రతపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.

గ్రామ అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామ ప్రజలు ఆకాంక్షించారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థతో గ్రామంలో పారిశుద్ధ్యం, పరిశుభ్రత మరింత మెరుగుపడి, ప్రజలకు సౌకర్యవంతమైన జీవన వాతావరణం ఏర్పడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

కంకర మిషన్ ఏర్పాటు చేయొద్దు



- **గ్రామస్తులు కలెక్టర్ కు వినతి పత్రం అందజేత**

వెల్దుర్తి, సెప్టెంబర్ 21, (సిరి న్యూస్):

వెల్దుర్తి మండలం కుక్కునూరు గ్రామంలో గుడిబండ పై కంకర మిషన్ ఏర్పాటు చేయడానికి దళారులు చాలా సంవత్సరాల నుండి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని , కంకర మిషన్ ఏర్పాటు చేస్తే కుక్కునూరు గ్రామంతో పాటు ఇతర గ్రామాలలో కూడా వ్యవసాయం కుంటూ పడుతుంది. అదే కాకుండా వ్యవసాయ బోర్లు, కుంటలు, చెరువులు అన్ని కుంటూ పడే అవకాశాలు ఉన్నాయి అని నర్సాపూర్ శాసన సభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మాజీ జెడ్పిటిసి రమేష్ గౌడ్, గ్రామస్తులు కలెక్టర్ కు మొరపెట్టుకున్నారు. అంతేకాకుండా ఈ కంకర మిషన్ విషయంలో గ్రామ పెద్దలు & ప్రజలు గ్రామసభలో ఈ మిషన్ ఏర్పాటు చేయకూడదని ఏకగ్రీవంగా తీర్మానం చేసినాము కావున ఈ విషయంలో ఇంతకుముందు ఉన్నటువంటి అన్ని అనుమతులను అన్నింటిని రద్దు చేయగలరని గ్రామస్తులతో పాటు నర్సాపూర్ శాసనసభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి అధ్యక్షతన గ్రామస్తులు కలెక్టర్ ను కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ఈ విషయంపై చర్చించి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రమేష్ గౌడ్, గ్రామ సర్పంచ్ సాయిలు, ఉప సర్పంచ్ నవీన్, మండల నాయకుడు ప్రతాప్ రెడ్డి, మహేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కరణం మురళి, రాములు, ఆరెగూడెం మాజీ సర్పంచ్ శేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పచ్చని చెట్లే భావితరాలకు నిధి

- **బ్రాహ్మణ కుంట మార్గంలో కౌన్సిలర్ హరిత యజ్ఞం**
- **వైకుంఠధామం మార్గానికి కొత్త రూపం**
- **1500 మొక్కలు నాటిన కౌన్సిలర్ కృష్ణ**

జిన్నారం సెప్టెంబర్ 21 సిరి న్యూస్

గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీపతి గూడెం , 17 వ వార్డు కౌన్సిలర్ కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం 1500 మొక్కలు బ్రాహ్మణ కుంట నుండి వైకుంఠ ధామం వరకు హరిత విప్లవం చేపట్టారు.



ఈ సందర్భంగా కౌన్సిలర్ కృష్ణ మాట్లాడుతూ.. విష్ణు కెమికల్ పరిశ్రమ ప్రోత్సాహం పరిశ్రమ యాజమాన్యం మరియు ప్రతినిధుల ప్రత్యేక ప్రోత్సాహం, ప్రాజెక్టు సహకారంతో ఈ హరిత కార్యక్రమం రూపుదిద్దుకుందని తెలిపారు. మొక్కల సంఖ్య వివరాలు, ప్రణాళిక బద్ధంగా పరిసర ప్రాంతాలలో నీడనిచ్చే మరియు పర్యావరణానికి మేలు చేసే మొక్కలను నాటారు. రాగి వేప జామ అల్లనేరేడు ఇతర రకాల మొక్కలు నాటారు అని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి
బాధ్యత అని నాటిన ప్రతి మొక్కను సంరక్షించి పెద్దది చేసేలా వాడు నివాసులతో కలిసి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు,విష్ణు కెమికల్స్ ప్రతినిధులు, మరియు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు.

చిరు మువ్వల సవ్వడి



- **చిన్నారుల నాట్య విన్యాసం**
- **కళ్ళు తిప్పుకొనివ్వని అభినయం**
- **కూచిపుడిలో మెరిసిన చిన్నారులు**

అమీన్పూర్ సెప్టెంబర్ 21 సిరి న్యూస్

శ్రీ గణేష్ ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు. అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ సాయి భగవాన్ కాలనీ వినాయక మండపం వద్ద ఏర్పాటుచేసిన ఆర్ట్స్ అసోసియేషన్స్ నిర్వాహకులు డాక్టర్ పి.శ్రీనివాస్,వరప్రసాద్,డాక్టర్ సంధ్యాదేవి సమక్షంలో కన్నుల పండువగా నాట్యోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఆకట్టుకున్న అభినయం పసిప్రాయంలోనే చిన్నారులు చూపిన భావాభినయం, కాలజ్ఞానం మువ్వల సవ్వడి సభా ప్రాంగణాన్ని మైమరిపించాయి అని తెలిపారు. చిన్నారుల నాటుకకు ఫిదా, పసి వయసులోనే అంతటి కఠినమైన కూచిపూడి భంగిమలను తరంగంపై బిందెముఖంగా



వేసిన విన్యాసాలను సునాయాసంగా ప్రదర్శించడంతో నృత్య ప్రియులు మరియు అభిమానులు అదుర్స్ అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారు, కృతిఅన్విక శ్రీ, అన్విత, ఆనంది, లాస్య, వివర్ధన కృష్ణ, భవ్యశ్రీ, హాసిని, దుర్గ, సహస్ర, వేద, కార్తిక, హార్ధ్య ,సిరి , ఆవని, బుద్విక ,సౌగంధి

యుక్తితో, నేర్పుగా వ్యవహరించాలి





- **భారత–పశ్చిమాసియా విధానంపై కల్నల్ రాజీవ్ అగర్వాల్**

పటాన్‌చెరు, సెప్టెంబర్ 21 (సిరి న్యూస్):

పశ్చిమాసియాతో భారతదేశానికి ఉన్న సంబంధాలను యుక్తితో, నేర్పుగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని చింతన్ రీసెర్చ్ ఫౌండేషన్ సీనియర్ రీసెర్చ్ కన్సల్టెంట్, కల్నల్ రాజీవ్ అగర్వాల్ (రిటైర్డ్) అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీలో ‘ప్రాంతీయ సంఘర్షణ, విచ్ఛిన్నత నేపథ్యంలో భారత పశ్చిమాసియా విధానాన్ని పునఃసమీక్షించడం’ అనే అంశంపై ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. భారత్-పశ్చిమాసియా సంబంధాలు ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, అనుసంధానం వంటి పలు రంగాలకు విస్తరించాయని తెలిపారు. హోర్ముజ్ జలసంధి ప్రాధాన్యతను వివరిస్తూ, ఇంధన భద్రతతో పాటు భారత ప్రవాసులు, నావికుల ప్రయోజనాలను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. భద్రత, ఇంధన భద్రత, అనుసంధానం, వాణిజ్యం, పెట్టుబడులు, దౌత్యం వంటి అంశాలతో కూడిన ‘షీల్డ్’ ఫ్రేమ్‌వర్క్‌ను ప్రతిపాదించారు. గీతంలో జాతీయ పోషకాహార వారోత్సవాలు జాతీయ పోషకాహార వారోత్సవాల్లో భాగంగా గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లైఫ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ‘ఫుడ్ టెక్నో ఫెస్ట్-2026’ నిర్వహించారు. సీఎస్ఐఆర్-సీఎఫ్‌టీఆర్ఐ మాజీ డైరెక్టర్ డాక్టర్ శ్రీదేవి అన్నపూర్ణ సింగ్ ఆహార శుద్ధి, సమతుల్య పోషకాహారం, ప్రత్యామ్నాయ ప్రోటీన్లు, ఆహార నిల్వ, గట్ హెల్త్ ప్రాధాన్యతను వివరించారు. మ్యానే టెక్నికల్ డైరెక్టర్ దేబాశిష్ మొహంతి వినియోగదారుల ప్రాధాన్యతల ఆధారంగా ఆహార ఉత్పత్తుల అభివృద్ధిపై ప్రసంగించారు. విద్యార్థులు పోస్టర్ ప్రజెంటేషన్లు, సమూనాల తయారీ, వినూత్న ఆహార ఉత్పత్తి అభివృద్ధి పోటీల్లో పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలి

- **ఫిర్యాదుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలియజేయాలి.**
- **జాప్యం లేకుండా సమస్యలు పరిష్కరించాలి.**
- **జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు.**

మెదక్ సెప్టెంబర్,21(సిరి న్యూస్)

ప్రజావాణిలో అందే ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం అందించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో



ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక మోసాలు, వేధింపులు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్రంగా
విచారణ చేపట్టి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయరాదని, విచారణలోని పురోగతిని ఫిర్యాదుదారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

మెదక్‌ను నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతాం

- **అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధే లక్ష్యం.**
- **పేదలకు అనేక సంక్షేమ పథకాలు.**
- **నియోజకవర్గానికి భారీగా అభివృద్ధి నిధులు.**
- **లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ.**
- **మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు.**

మెదక్ సెప్టెంబర్,21(సిరి న్యూస్)

మెదక్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి నంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులను తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.సోమవారం మెదక్ పట్టణంలోని మంజీరా గార్డెన్‌లో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాలకు రేషన్ కార్డు ఎంతో కీలకమని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు అర్హత కల్పించే ముఖ్యమైన పత్రాల్లో ఇది ఒకటని అన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డుల జారీ విషయంలో నిర్లక్ష్యం జరిగిందని ఎమ్మెల్యే ఆరోపించారు. దీంతో అనేక మంది అర్హులైన పేద కుటుంబాలు ప్రభుత్వ సంక్షేమ



పథకాలకు దూరంగా ఉన్నాయని పేర్కొన్నారు. రోడ్లు,డ్రైనేజీ, తాగునీరు, విద్య, వైద్యం తదితర రంగాల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.మెదక్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి నంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతిరాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు,మున్సిపల్ కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్మార్ట్ రేషన్ కార్డు లబ్ధిదారులు పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడుకు వినతిపత్రం

- **కళ్యాణ రామచంద్ర స్వామి రామాలయ నిర్మాణానికి టీటీడీని ఆర్థిక సహాయం కోరిన ఆలయ కమిటీ**



గుమ్మడిదల, సెప్టెంబర్ 21 (సిరి న్యూస్):

పురపాలక సంఘం కేంద్రమైన గుమ్మడిదలలో నిర్మాణంలో ఉన్న శ్రీ కళ్యాణ రామచంద్రస్వామి ఆలయ నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరఫున ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ గుమ్మడిదల దేవాలయ కమిటీ సభ్యులు టీటీడీ చైర్మన్ శ్రీ బి.ఆర్. నాయుడును కలిసి వినతిపత్రం సమర్పించారు. గుమ్మడిదలలో శ్రీ కళ్యాణ రామచంద్ర స్వామి ఆలయ నిర్మాణం భక్తుల సహకారంతో కొనసాగుతోందని, ఆలయ నిర్మాణం పూర్తయితే గుమ్మడిదలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఆధ్యాత్మికంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కమిటీ సభ్యులు టీటీడీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆలయ నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా టీటీడీ నుంచి ఆర్థిక సహకారం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు మద్దుల బాల్‌రెడ్డి మాట్లాడుతూ గుమ్మడిదలలో శ్రీ కళ్యాణ రామచంద్ర స్వామి ఆలయ నిర్మాణం భక్తుల చిరకాల ఆకాంక్ష అని తెలిపారు. ఆలయ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో వివిధ వర్గాల సహకారం కోరుతున్నామని చెప్పారు. టీటీడీ నుంచి ఆర్థిక సహాయం అందితే ఆలయ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ ఆలయంలో రామలక్ష్మణ భరత శత్రుఘ్నులతో పాటు వారి సతీమణులతో కూడిన కుటుంబ సభ్యుల విగ్రహాలు ప్రతిష్టించబడి ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు మద్దుల బాల్‌రెడ్డి, మాజీ స ర్పంచ్ తులసీదాస్, కోశాధికారి పోచుగారి రవీందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా నూతన కమిటీకి సన్మానం



మునిపల్లి, సెప్టెంబర్ 21 (సిరి న్యూస్):

మునిపల్లి మండల బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా కృష్ణమూర్తి,ప్రధాన కార్యదర్శులుగా విజయ్ కుమార్ స్వామి, కరుణాకర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కంకోల్‌లోని చిల్ హెవెన్ హోటల్‌లో బీజేపీ మునిపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన ఓబీసీ మోర్చా నాయకులను సన్మానించారు.

కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నాగిశెట్టి, ఉపాధ్యక్షుడు వీరన్న పాటిల్, సీనియర్ నాయకులు సంగయ్య స్వామి, అయ్యప్ప స్వామి, నవీన్, ఉపేందర్, ప్రవీణ్ కుమార్, సాయిబాబా, కంకోల్ గ్రామ బూత్ అధ్యక్షుడు రాకేష్, రవి యాదవ్, వీరన్న పాల్గొన్నారు.

వేగవంతంగా సర్ ప్రక్రియను పూర్తి చేయాలి

- **రానున్న 40 రోజులు సర్ పై ప్రత్యేక దృష్టి సారించాలి.**
- **రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి.**
- **అక్టోబర్ 25లోపు అన్ని ప్రక్రియలు పూర్తి చేయాలి.**
- **జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి.**



మెదక్ సెప్టెంబర్,21(సిరి న్యూస్)

ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో భాగంగా రానున్న 30 నుంచి 40 రోజులు ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు.సోమవారం హైదరాబాదు నుంచి ఎస్ఐఆర్-2026 కార్యక్రమంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఈ వీడియో సమావేశానికి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఫారం6, ఫారం7, ఫారం8 దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని సూచించారు. నోటీసులు జారీ చేయడంతో పాటు వాటిపై తదుపరి చర్యలు చేపట్టి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. చివరి నిమిషం వరకు ఫారం6, 7, 8 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ముందుగానే పరిష్కరించాలని స్పష్టం చేశారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలను కూడా ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కరించాలని తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫారం6, ఫారం7, ఫారం8 దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మెదక్ ఆర్డీఓ రమాదేవి ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ గఫర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ వర్కర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మునిపల్లి, సెప్టెంబర్ 21 (సిరి న్యూస్):

గ్రామపంచాయతీ వర్కర్ల సమస్యలను పరిష్కరించి పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ గ్రామపంచాయతీ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం మునిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ మండల అధ్యక్షుడు ఇమ్మానియేల్ మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న గ్రామపంచాయతీ
వర్కర్లకు మూడు, నాలుగు
నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే మంజూరు చేసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్లు బి.రవి, యాదయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

భర్తను హత్య చేసిన భార్యకు జీవిత ఖైదు

- **పకడ్బందీ దర్యాప్తు.. బలమైన సాక్ష్యాధారాలతో నిందితురాలికి శిక్ష.**
- **జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు.**



మెదక్ సెప్టెంబర్,21(సిరి న్యూస్)

మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో జరిగిన హత్య కేసులో నిందితురాలికి జిల్లా ప్రధాన న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు రూ.6,000 జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు.
పర్కిబండ గ్రామానికి చెందిన మురళికి, మనోహరాబాద్‌కు చెందిన విజయలక్ష్మితో సుమారు 22 సంవత్సరాల క్రితం వివాహం జరుగగా,వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య కుటుంబ విషయాలపై తరచూ వివాదాలు జరుగుతుండటంతో మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పలుమార్లు కౌన్సెలింగ్ నిర్వహించారు. మురళికి సుమారు 18 నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో కాలు విరగడంతో అప్పటి నుంచి పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్న క్రమంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. 15.03.2021 రాత్రి మురళి మంచంపై నిద్రిస్తున్న సమయంలో విజయలక్ష్మి రోకలిబండతో అతనిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి మనోహరాబాద్ ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలు చేసి సాక్షులను న్యాయస్థానంలో ప్రవేశపెట్టి కేసు విచారణను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ బలమైన వాదనలు వినిపించారు. పూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిందితురాలికి జీవిత ఖైదుతో పాటు రూ.6,000 జరిమానా విధించారు.కేసు విచారణలో కోర్టు లైజన్ అధికారులు ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ మహిపాల్ రెడ్డి సహకరించారు. నిందితురాలికి శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు చేసి, పటిష్ఠమైన సాక్ష్యాధారాలను న్యాయస్థానంలో సమర్పించిన దర్యాప్తు అధికారులు, కోర్టు లైజన్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

ఆర్వి రెసిడెన్సీలో హోరాహోరీగా లడ్డు వేలం..




- **రూ.1,15,001కి దక్కించుకున్న రమ్య శ్రీనివాస్ రెడ్డి...**

అమీన్‌పూర్ సెప్టెంబర్ 21 సిరి న్యూస్

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా,ఉత్సాహంగా వేలంపాట ఆర్వి రెసిడెన్సీ ప్రాంగణంలో గణనాథుడు లడ్డు వేలంపాట అత్యంత కోలాహలంగా భక్తిశ్రద్ధల నడుమ జరిగింది. అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని జాకి క్లాసిక్ ఆర్వి రెసిడెన్సీ లోని గణనాధుడి లడ్డు రూ.1,15,001 ధర పలికింది. పోటీ పడిన భక్తులు, స్వామి వారి దివ్య ప్రసాదాన్ని దక్కించుకునేందుకు నివాసితులు మరియు ఉత్సవ కమిటీ సభ్యులు ఉత్సాహంగా పోటీపడ్డారు. లడ్డు సొంతం, తీవ్ర పోటీ నడుమ ఉత్సవ కమిటీకి చెందిన రమ్య శ్రీనివాస్ రెడ్డి దంపతులు లడ్డును సొంతం చేసుకున్నారు. భక్తుల హర్షం లడ్డు ప్రసాదని దక్కించుకున్న రమ్య శ్రీనివాస్ రెడ్డికి రెసిడెన్సి నివాసితులు, కమిటీ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నగర నడిబొడ్డునే పేదలకు సొంత అపార్ట్‌మెంట్





- **రాయదుర్గం మల్కం చెరువు వద్ద ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన**
- **లాటరీతో ఎంపిక..రిజిస్ట్రేషన్ ఉచితం -వచ్చే బోనాలకు గృహప్రవేశం లక్ష్యం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 21(సిరి న్యూస్):

పట్టణ పేదల సొంతింటి కలకు తెలంగాణ ప్రభుత్వం మరో అడుగు వేసింది. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని రాయదుర్గం, మల్కం చెరువు సమీపంలో ప్రతిష్టాత్మక ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణానికి రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార ప్రజాసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు.ఇది కేవలం మరో గృహనిర్మాణ కార్యక్రమం కాదని, నగరంలోని అత్యంత ఖరీదైన ప్రాంతంలోనే పేద కుటుంబాలకు గౌరవంగా నివసించే అవకాశం కల్పించే ప్రయత్నమని మంత్రి స్పష్టం చేశారు.

దూరానికి తరలించం..ఇక్కడే ఇల్లు ఇస్తాం

ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ఆలోచనకు అనుగుణంగా, పేదలు ఇప్పుడు ఉంటున్న ప్రాంతాలకు సాధ్యమైనంత దగ్గరలోనే సొంత ఇల్లు అందించాలనే లక్ష్యంతో ఈ టవర్స్ రూపుదిద్దుకున్నాయని పొంగులేటి అన్నారు.గతంలో పేదలకు ఇళ్లు ఇస్తామని చెప్పి నగరానికి 30, 40 కిలోమీటర్ల దూరంలో నిర్మించిన విధానానికి భిన్నంగా, కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ నడిబొడ్డునే ఇళ్లు కడుతోందని ఆయన పేర్కొన్నారు. ఎకరం వందల కోట్లు పలికే ప్రాంతంలో ఇల్లు ఇవ్వడం అంటే కేవలం నాలుగు గోడలు కాదు, భద్రత, భరోసా, తరతరాల ఆస్తి అని వివరించారు.పేదవాడి కలను పైకప్పుతో ముగించడం మా లక్ష్యం కాదు. ఆత్మగౌరవంతో జీవించే చిరునామా ఇవ్వడమే ఇందిరమ్మ టవర్స్ ఉద్దేశమని మంత్రి అన్నారు.

హక్కులతో కూడిన ఇల్లు..ఉచిత రిజిస్ట్రేషన్

లబ్ధిదారులకు 17 నుంచి 20 గజాల వరకు అన్‌డివైడెడ్ షేర్‌తో పాటు అపార్ట్‌మెంట్‌పై పూర్తి యాజమాన్య హక్కులు కల్పిస్తామని ప్రభుత్వం తెలిపింది. సేల్ డీడ్‌ను రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా అందించాలని
నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు.రాయదుర్గం ప్రాజెక్టు మల్కం చెరువు వెనుక సుమారు 2.85 ఎకరాల స్థలంలో చేపట్టబడింది. తొలి విడతలో 480 ఫ్లాట్లు నిర్మిస్తారు. నాలెడ్జ్ సిటీ వంటి ప్రాంతంలో మార్కెట్ విలువ పలు పదుల లక్షలు ఉండే ఫ్లాట్‌ను సబ్సిడీతో పేద కుటుంబాలకు అందించేలా ప్రభుత్వం రూపకల్పన చేసింది.

పైరవీలకు తావు లేదు...

లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యానికి, సిఫార్సులకు, ఒత్తిళ్లకు అవకాశం లేదని మంత్రి కఠినంగా చెప్పారు. లాటరీ పద్ధతిలో, అర్హత ఆధారంగా పారదర్శకంగా ఎంపిక జరుగుతోందన్నారు. తెలంగాణ హౌసింగ్ బోర్డు క్యూర్ ప్రాంతంలో లాటరీ ఫలితాలను బహిరంగంగా ప్రకటించి, అభ్యంతరాలు స్వీకరించే విధానం అమలు చేస్తోందని పేర్కొన్నారు.ప్రస్తుతం ప్రతి నియోజకవర్గంలో తొలి విడతగా 480 ఇళ్ల చొప్పున పనులు మొదలయ్యాయి. పలు చోట్ల టెండర్లు, అగ్రిమెంట్లు పూర్తయ్యాయని, త్వరలో నిర్మాణం వేగం పుంజుకుంటుందని చెప్పారు.

గ్రామాల్లో లక్షలాది ఇళ్లు..నగరంలో లక్ష టవర్ ఇళ్లు..

గ్రామీణ ప్రాంతాల్లో తొలి దశలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లు మంజూరయ్యాయన్నారు. హైదరాబాద్ నగర పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికే టవర్స్ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు.తొలి విడతలో ఇల్లు రాని అర్హులు నిరాశ పడాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. రెండో నుంచి ఐదో విడత వరకు కూడా నిర్మాణం జరుగుతుందని, రాబోయే రెండున్నరేళ్లలో క్యూర్ ప్రాంతంలో అర్హులైన పేదలకు దశలవారీగా ఇళ్లు అందిస్తామని అన్నారు.

వచ్చే బోనాలకు ఇక్కడి నుంచే పూజ....

నిర్మాణాన్ని వేగవంతం చేసి, వచ్చే బోనాల నాటికి ఇక్కడి నుంచే లబ్ధిదారులు బోనాలు ఎత్తించేలా పనులు పూర్తి చేస్తామని మంత్రి ప్రకటించారు.నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. లబ్ధిదారులు వారానికోసారి సైట్‌కు వచ్చి తమ ఇల్లు ఎలా కడుతున్నారో చూసుకోవచ్చని, లోపం కనిపిస్తే అక్కడే ఉన్న అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సమస్య పరిష్కార బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు.ఇది ప్రభుత్వం ఇచ్చే గిఫ్ట్ కాదు.మీ పిల్లలకు, మీ తరాలకు మిగిలే ఆస్తి. రాయదుర్గం వంటి ప్రాంతంలో నాకూ సొంత అపార్ట్‌మెంట్ ఉందని మీ పిల్లలు గర్వంగా చెప్పుకునేలా ఈ ఇంటిని కాపాడుకోండి'' అని ఆయన పిలుపునిచ్చారు.పేదల ఇళ్ల కార్యక్రమాన్ని రాజకీయ విమర్శలకు ఉపయోగించుకోవడం సరికాదని మంత్రి అన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, చేసిన పనులపై ప్రజలే తీర్పు చెప్పారని గుర్తు చేశారు.శంకుస్థాపనలో స్థానిక ప్రజాప్రతినిధులు, హౌసింగ్ బోర్డు అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో టౌన్ ప్లానింగ్‌పై ఫిర్యాదుల జోరు

- **సీఎంసీ ప్రజావాణికి 41 వినతులు**

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 21(సిరి న్యూస్):

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణికి మొత్తం 41 ఫిర్యాదులు అందాయి. వీటిలో 36 వినతులు టౌన్ ప్లానింగ్ శాఖకు సంబంధించినవే కాగా, ఇంజినీరింగ్‌కు రెండు, ఎలక్ట్రికల్, భూసేకరణ, క్రీడల శాఖలకు
ఒక్కొక్కటి చొప్పున వచ్చాయి.అన్ని వినతులను శాఖల వారీగా నమోదు చేసి పరిశీలనకు పంపగా, ప్రతి దరఖాస్తుకు గ్రీవెన్స్ ఐడీ, ట్రాకింగ్ లింక్ కేటాయించారు. నిర్దేశిత గడువులోగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు సీఎంసీ తెలియజేశారు.

గిరిజా మార్వెల్ కమ్యూనిటీలో ఘనంగా గణనాథుడి నిమర్జనం



- రూ.6,20116 లక్షలకు వినాయకుడి లడ్డూ దక్కించుకున్న డి బ్లాక్ ఓనర్స్

శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 21(సిరి న్యూస్)

చందానగర్ లో వినాయకుడి లడ్డూ వేలం భక్తుల్లో ఆసక్తి రేకెత్తించింది. మియాపూర్ సర్కిల్ పరిధిలోని గిరిజా మార్వెల్స్ కమ్యూనిటీలోని జిఎం గణేష్ ఉత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో లడ్డూ వేలం పాట నిర్వహించారు. భక్తులు ఉత్సాహంగా పాల్గొనగా.. అదే కమ్యూనిటీకి చెందిన డి బ్లాక్ నివాసితులు రూ.6.20116/లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. వినాయకుడికి నైవేద్యంగా సమర్పించిన లడ్డూను సొంతం చేసుకునేందుకు భక్తులు పోటీపడ్డారు.వేలం ప్రక్రియలో చివరకు డి బ్లాక్ నివాసితులు లడ్డూను సొంతం చేసుకున్నారు.లడ్డూను దక్కించుకున్న వారిని మండప నిర్వాహకులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ లడ్డు వేలంపాటలో భక్తులు, జిఎం గణేష్ ఉత్సవ్ కమిటీ సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాప్ వద్దు.. మట్టి వినాయకులే ముద్దు

- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే పీఏసీ చైర్మన్ గాంధీ



శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 21 (సిరి న్యూస్):

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పలు కాలనీల వినాయక మండపాలను సందర్శించిన పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడు అందరి జీవితాల్లోని విఘ్నాలను తొలగించి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకున్నారు.సంప్రదాయాలను కాపాడుకుంటూనే పర్యావరణాన్ని రక్షించాలని పిలుపునిస్తూ,ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల చెరువులు కలుషితమవుతాయని హెచ్చరించిన గాంధీ, ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించాలని, చెరువుల సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు.పండుగ సందర్భంగా ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా అధికారులను, మండప నిర్వాహకులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రూ.1,36 లక్షల కు ధర పలికిన గణేష్ లడ్డు



పెద్ద శంకరం పేట, సెప్టెంబర్ 21, (సిరి న్యూస్):

పట్టణం లోని మాధవ నగర్ కాలనీలో నెలకొల్పిన వినాయక మండపం వద్ద ఏర్పాటు చేసిన వినాయకు డీ లడ్డు వేలం పాట లో రికార్డ్ స్థాయి పలికింది. రూపాయలు 1,36,666 లకు హైదరాబాద్ కు చెందిన కిరణ్ అనే వ్యాపారి దక్కించుకున్నాడు. గత ఏడాది కూడా గజం సాయి కిరణ్ లక్షా 30 వేల కు పాట పాడి గెలుచుకున్నాయి. గత ఏడాది తో పోలిస్తే ఈ ఏడాది మంచి డిమాండ్ మేరకు లడ్డు ధర పలకడం తో నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ వేలం పాట లో నిర్వాహకులు దాదిగారి గంగాధర్, చకిలం సంతోష్ కుమార్, రాగం సిద్ధు, ప్రభాకర్, మాజీ ఎం పీ పి జంగం శ్రీనివాస్, వ్యాపారులు కొత్త శ్రీనివాస్, పెంటయ్య, కుమార్, ఉప్పల భాను, మిల్క్ సెంటర్ నరసింహరెడ్డి, నారాయణ సార్, తదితరులు పాల్గొన్నారు.



చరవాణే ముద్దు.. ప్రజా సమస్యలు మాకొద్దు..





- సమీక్ష సమావేశంలో టైంపాస్ చేస్తున్న అధికారులు
- తూతూ మంత్రంగా సమీక్ష సమావేశం
- పలు శాఖాల అధికారులు గైర్హాజరు

వెల్దుర్తి సెప్టెంబర్ 21 (సిరి న్యూస్):

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి, ప్రజలకు దూరభారాలు తగ్గించడానికి మండల కేంద్రాల్లో మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. సోమవారం వెల్దుర్తి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమీక్ష సమావేశానికి ఒక వైపు కొంతమంది అధికారులు డుమ్మా కొట్టారు. ఇక వచ్చిన మిగతా అధికారులు కూడా సమావేశంలో ప్రజా సమస్యలను వినకుండా చరవాణిలోనే మునిగిపోవడం విడ్డూరం. మండలంలో వివిధ శాఖలో అనేక సమస్యలు ఉన్న వచ్చిన అధికారులను మండలంలోని గ్రామాల సర్పంచులు సమస్య గురించి నిలదీసిన పొంతన లేని సమాధానాలతో కాలయాపన చేశారు తప్ప వాటికి సరైన సమాధానాలు ఇవ్వలేకపోయారు. మహిళా సమైక్య భవనాలు నిర్మాణాల్లో వెనుకంజ, విద్యుత్ శాఖలో, గ్రామాలలో పలు సమస్యలు, విద్యాశాఖలో ఇంకా కొన్ని పాఠశాలల్లో యూనిఫామ్ లు ఇవ్వలేదని , పల్లె దావఖానలో అందుబాటులోని డాక్టర్లు,సిబ్బంది, మిషన్ భగీరథ లో మురికి నీటి సమస్య, ఏలుకపల్లి, ఏ దులపల్లి, గ్రామాలలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంల, అసలు నియమకాలే లేవు, ఇరిగేషన్ శాఖలో తూముల మరమ్మత్తు కట్టల మరమ్మత్తు చేసిన ఇప్పటివరకు అందని బిల్లులు, మండలంలోని మేజర్ గ్రామాలలో అధ్వానంగా మారిన పారిశుద్ధ్య, పనులు, ఒకటి రెండు కాదు అనేక సమస్యలతో వెల్దుర్తి మండలం మొత్తం వెనుకంజలో ఉందని పలువురు సర్పంచుల ఆవేదన,ఇది ఇలా ఉండగా వచ్చిన అధికారులు టైం పాస్ చేస్తూ ప్రజలకు సేవలు అందించాల్సిన వారి విలువైన సమయాన్ని వృధా చేస్తున్నారు. చరవాణి ల్లో తలామునకలవుతూ సమీక్ష సమావేశం తో తమకేం సంబంధం లేనట్టుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా వచ్చిన ప్రత్యేక అధికారి పలువురు శాఖల అధికారులపై పదేపదే సమస్యల గురించి పట్టించుకోమని చెప్పడం, గత సమావేశానికి ఈ సమావేశానికి మధ్యలో ఇన్ని రోజుల వ్యవధి ఉన్న అధికారుల పనుల్లో మాత్రం ఎటువంటి అభివృద్ధి కనబడత లేదని గ్రామ సర్పంచులు మండిపడ్డారు. ఏదులపల్లి, ఏలుకపల్లి గ్రామ సర్పంచులు మాట్లాడుతూ తమ గ్రామాలకు ఆశా వర్కర్లను అలాగే ఏఎన్ఎం లను నియమించాలని ప్రత్యేక అధికారిని కోరటం జరిగింది. అనంతరం మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ వచ్చే సమావేశం లోపల ఇట్టి పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో మాటలు తప్ప పనుల్లో మాత్రం జాప్యం కనబడుతుందని గ్రామ సర్పంచులు పూర్తిస్థాయిలో మండిపడ్డారు.

కొండ లక్ష్మణ్ బాపూజీ ఆశయాలతో పని చేయాలి

- చేనేత కార్మికులకు షరతులు లేకుండా పెన్షన్లు ఇవ్వాలి.
- రామాయంపేటలో
- ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళులు.
- మెదక్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు మ్యాకల జయరాములు.
- రామాయంపేట మండల శాఖ అధ్యక్షుడు మద్దెల రమేష్

రామాయంపేట, సెప్టెంబర్ 21 (సిరి న్యూస్)



తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని పద్మశాలి సంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడు మ్యాకల జయ రాములు అన్నారు. ఆయన ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి సందర్భంగా సోమవారం రామాయంపేటలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పద్మశాలి మెదక్ జిల్లా సంఘం అధ్యక్షులు మ్యాకల జయరాములు మాట్లాడుతూ.. లాయర్‌గా బాధితుల తరఫున నిలబడి వారికి న్యాయం అందించేందుకు కొండా లక్ష్మణ్ బాపూజీ ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు.

చేనేత కార్మికులందరికీ పెన్షన్ ఇవ్వాలి

చేనేత వృత్తిదారులకు పెన్షన్లు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో పెన్షన్‌కు ఐడీ కార్డు తప్పనిసరి చేస్తూ నిబంధనలు విధించడం సరికాదని జయరాములు అన్నారు. చేనేత సొసైటీల్లో సభ్యులుగా ఉన్న వారితో పాటు, వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న 50 సంవత్సరాలు నిండిన ప్రతి చేనేత కార్మికుడికి ఎలాంటి షరతులు విధించకుండా పెన్షన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. చేనేత వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న వృద్ధ కార్మికులకు పెన్షన్ ద్వారా ఆర్థిక భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఈ అంశాన్ని పరిశీలించి చేనేత కార్మికులందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంకా ఈ సమావేశంలో రామాయంపేట మండల శాఖ అధ్యక్షుడు మద్దెల రమేష్, పద్మశాలి సంఘం నాయకులు మోహన్, బల్ల సుధాకర్, సామల రవి తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేటలో సామూహిక కుంకుమార్చన..





రామాయంపేట, సెప్టెంబర్ 21 (సిరి న్యూస్)

మెదక్ జిల్లా రామాయంపేటలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ స్వామి దేవాలయం పద్ద వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం మహిళల భక్తి గీతాలు, పూజా కార్యక్రమాలతో సందడిగా మారింది. అనంతరం భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజ్ , పుట్టి సందీప్, కో ఆప్షన్ సభ్యులు దేమే యాదగిరి, జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు మ్యాకల జయరాములు, కాంగ్రెస్ నాయకులు పోచమ్మల గణేష్, డాకిస్వామి, చింతల యాదగిరి. చౌదరి సుప్రభాత రావు, అల్లాడి వెంకటి, రామాయంపేట మండలం పద్మశాలి సంఘం అధ్యక్షుడు మద్దెల రమేష్,గద్దె మోహన్. గజం యాదగిరి . సామల రవి, రామాంజనేయులు. ఎం వి ఆర్ మోహన్. సామల ధర్మపురి. కర్రె నరేందర్. బల్ల యాదగిరి.బల్ల సుధాకర్.పంతులు బల్లరాజయ్య. వల్లకాటి శ్రీనివాస్.వల్లకాటి రామచంద్రం.అల్లాడి వెంకటి వినయ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు వినాయక నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు పద్మశాలి సంఘం సభ్యులు, నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎమ్మెల్యే రోహిత్ రావు సహకారంతో అభివృద్ధి పనులు..





- మున్సిపల్ కౌన్సిలర్లు గజవాడ నాగరాజు గుప్తా, గుగులోతు రవి.

రామాయంపేట, సెప్టెంబర్ 21 (సిరి న్యూస్)

రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులకు వేగం పెంచుతూ 3వ వార్డులో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ పాలకవర్గ సభ్యులు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే రోహిత్ రావు ఆదేశాల మేరకు నగర అభివృద్ధి నిధుల నుంచి సుమారు రూ.38 లక్షలు వెచ్చించి ఈ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, గుగులోతు రవి నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రామాయంపేట మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, మౌలిక వసతులు అందించడంతో పాటు స్థానికంగా ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. రామాయంపేట అభివృద్ధి కోసం ఎమ్మెల్యే రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కృషి చేస్తున్నారని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని కౌన్సిలర్లు హామీ ఇచ్చారు. సీసీ రోడ్డు నిర్మాణంతో 3వ వార్డు ప్రజలకు రాకపోకలలో ఇబ్బందులు తొలగి సౌకర్యం మెరుగుపడుతుందని తెలిపారు .ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు దేమే యాదగిరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతల యాదగిరి, చింతల స్వామి, డాకి స్వామి, సుంకోజు దామోదర్, ఎనిశెట్టి అశోక్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

కులమతాలు భేదాలు లేకుండా అందరూ సన్మార్గంలో నడవాలి.





సదాశివపేట. సెప్టెంబర్ 21. (సిరిన్యూస్)

దాశివపేట మండలం ఏటిగడ్డ సంఘం గ్రామంలో శ్రీ స్వామి వివేకానంద యువజన సంఘం వారు నెలకొల్పిన వినాయకుడి వద్ద ఘనంగా అన్నప్రసాద కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు జరపడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమం బర్దిపూర్ పీఠాధిపతులు. శ్రీశ్రీశ్రీ 1008 మహంత్ డా: సిద్దేశ్వర ఆనంద గిరి మహారాజ్ స్వామి సమక్షంలో జరిగింది. సిద్దేశ్వర స్వామి భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ తల్లిదండ్రులను గౌరవించాలని, యువత భక్తి మార్గంలో నడవాలని, కులమత భేదాలు లేకుండా అందరూ సన్మార్గంలో నడవాలని, గణపతి విగ్రహాలు గ్రామంలో ఒకటి మాత్రమే ఉంచి ఐక్యత చాటుకొని కోలాటాలతో భజనలతో నిమర్జనాలు నిర్వహించాలని సూచించడం జరిగింది. మండపం చాలా చక్కగా ఏర్పాటు చేశారని సంఘ సభ్యులను అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా మన్సూర్ అహ్మద్ ఆధ్వర్యంలో జానపద కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. విద్యార్థులకు పలు ఆట పోటీలు, చిన్నారులచే భరతనాట్యం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మన్సూర్ ని ఈ సందర్భంగా అప్పగారు అభినందించడం జరిగింది. ఈ సంవత్సరం గణపతి విగ్రహాన్ని అందించినందుకు శంభు ప్రసాద్ స్వామికి అన్నదాత జనార్దన్ కు అప్ప గారిచే సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శంభు ప్రసాద్ స్వామి, మాజీ సర్పంచ్ అమరేందర్ రెడ్డి, యూత్ అధ్యక్షులు కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి గురుగుల మల్లేశం ,వార్డు మెంబర్లు మౌనిక వీరన్న, గంగారం, సంఘం సభ్యులు బి కృష్ణ, బి జనార్ధన్, బి గోవర్ధన్,పి. సత్యనారాయణ , పి నరేష్, పి అనిల్,వి మహేందర్ , పి.శివశంకర్, వి శేఖర్, బి శ్రీధర్, మన్మోహన్ రావు, వీ తిరుపతి, వి చిరంజీవి, పి శివ కుమార్, ఎం .కృష్ణ , గ్రామ పెద్దలు సంగయ్య స్వామి, వడ్ల సదాశివుడు,ఎడ్ల వీరన్న, చిన్న వీరన్న , శ్రీధర్, పరమేశ్వరయ్య స్వామి, ఎం రాజు , భీమ్రావు , చంద్రమౌళి స్వామి, జి విజయ ,మచ్చేందర్,లాడే నాగేష్, బక్కన్న, ఏ.మల్లేశం ,నరసింహులు, విట్టల్, బి రమేష్ ,అంజన్న, సంగన్న, శరవంద ,గ్రామ మహిళలు విద్యార్థులు యువకులు పాల్గొనడం జరిగింది.

శ్రీ మార్కండేయ యూత్ అన్నదాన కార్యక్రమం

- **పాల్గొన్న 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత.**

సదాశివపేట. సెప్టెంబర్ 21. (సిరిన్యూస్) స

దాశివపేట పట్టణంలోని పనకట్ట, పాతకేరి ప్రాంతంలో సుమారు 60 సంవత్సరాలుగా కొనసాగుతున్న శ్రీ మార్కండేయ యువజన సంఘం, ప్రస్తుతం మార్కండేయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయకుని అన్నదాన కార్యక్రమానికి 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత రాజు దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్కండేయ యూత్ అసోసియేషన్ సభ్యులు కౌన్సిలర్ పులిమామిడి మమత రాజు దంపతులకు ఘన స్వాగతం పలికి, శాలువాలతో సన్మానించారు. అనంతరం గణపతి హోమం, వినాయకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలను ప్రముఖ వ్యాపారవేత్త, శ్రీ సాయి గణేష్ అధినేత రావుల పల్లి సంగమని మల్లిఖార్జున్, మానస అజయ్ గుప్తా దంపతులు నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఈశ్వర మార్కండేయ దేవస్థానం ఆలయ కమిటీ చైర్మన్ వెంకన్నబాబు, చేనేత సహకార సంఘం డైరెక్టర్ చిల్వేరి రచన, చీల రాధిక, రుమాండ్ల సునిత, శారద, చిల్వేరి రవి, శ్రీనివాస్, వెంకటేశం, రుమాండ్ల రాజు, ప్రకాష్, రమేష్, బిజ్జ రాజు, నీలి శ్రీకాంత్, భరత్, పోల ప్రభు, ఎన్నం సంగమేశ్వర్, బుచ్చిరాములు, పోల గణేష్, సిద్దు, మహేష్, సోమ శంకర్, యెన్నం సాయి, నరేష్, జగదీష్, తదితరులతో పాటు ఉషాకిరణ్ సభ్యులు, వీరభద్ర యూత్ సభ్యులు పాల్గొన్నారు.




సైకిల్ యాత్రలో విషాదం.!

- **సూర్యాపేట జిల్లాలో మెదక్ జిల్లా వాసికి రోడ్డు ప్రమాదం.**

మెదక్ సెప్టెంబర్,21(సిరి న్యూస్)

సైకిల్ యాత్రకు వెళ్లిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషాద ఘటన సూర్యాపేట జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మెదక్ మండలం మాచవరం గ్రామానికి చెందిన కోటపాటి రామకోటేశ్వరరావు (73)మృతి చెందడంతో ఆయన స్వగ్రామం మాచవరం లో విషాద ఛాయలు అలుముకున్నాయి.అద్భుత సాహసవీరుడిని బలిగొన్న 'L' బోర్డు కారు! 73ఏళ్ల వయసులో 600 కి.మీ. సైకిల్ సాహసయాత్రకు బయలుదేరిన సైక్లిస్ట్,గోల్డ్ మెడలిస్ట్,ఇంజనీర్ మృతి బాధాకరం .సూర్యాపేట జిల్లా పిల్లలమర్రి ఫ్లైఓవర్ వద్ద బాలెనో ఢీకొని సైక్లిస్టుల బృందాన్ని ఢీకొట్టిన TS08 HZ 8071 'L' బోర్డుతో కారు డికొందని కుటుంబ సభ్యులు తెలిపారు. 600 కి.మీ. గమ్యాన్ని జయించాలని బయలుదేరిన 75 ఏళ్ల సాహసవీరుడు... గమ్యం చేరకుండానే రహదారిపై ప్రాణాలు కోల్పోయారు. ఉస్మానియా యూనివర్సిటీ గోల్డ్ మెడలిస్ట్, రిటైర్డ్ ఇంజనీర్ కోటపాటి రామకోటేశ్వరరావు జీవనయానం పిల్లలమర్రి వద్ద విషాదంగా ముగిసిందని పలువురు మిత్రులు సంతాపం ప్రకటించారు.600 కి.మీ. సవాల్‌ను స్వీకరించాడు... కానీ ఒక్క రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరం.. మృతుడు సిద్ధార్థ్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ చౌదరి కి స్వయానా బాబాయ్. వారి అంత్యక్రియలు మంగళవారం జరగనున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు.



చర్చలు కాదు.. నిర్ణయాలు తీసుకోవాలి..

- **ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం కాలయాపన**
- **హెల్త్ కార్డుల అమలులోనూ వైఫల్యం**
- **మాజీ బేవరేజ్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్**

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (సిరి న్యూస్):

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తామని హామీలు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం మరోసారి కాలయాపన చేస్తోందని మాజీ బేవరేజ్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ తీవ్రంగా విమర్శించారు. సెప్టెంబర్ 21వ తేదీన సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు మళ్లీ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని చెప్పడం కేవలం కాలయాపనలో భాగమేనని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు ముఖ్యమంత్రికి అనేక సందర్భాల్లో ఉద్యోగుల ముఖ్యమైన డిమాండ్లను వివరించి విజ్ఞాపనలు ఇచ్చామని, ఇన్ని దఫాలుగా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన తర్వాత కూడా మళ్లీ అవే విషయాలు చెప్పడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని ప్రశ్నించారు. ఇకపై చర్చలు కాదని, తక్షణమే నిర్ణయాలు కావాలని ఉద్యోగులు గట్టిగా కోరుతున్నారని తెలిపారు. సెప్టెంబర్ 15న వస్తుందని చెప్పిన పీఆర్సీ నివేదికను మళ్లీ ఈ నెలాఖరుకు మారుస్తూ ప్రభుత్వం మాట మార్చడం ద్వారా తన వైఖరిని స్పష్టం చేసిందని, నివేదిక లేకుండా చర్చలు జరపడం హాస్యాస్పదమని అన్నారు. ఐదు విడతలుగా పెండింగ్‌లో ఉన్న కరువు భత్యంపై ఎలాంటి స్పష్టమైన నిర్ణయం తీసుకోకుండా ప్రభుత్వం నాన్చివేత ధోరణిని కొనసాగిస్తోందని మండిపడ్డారు. సీపీఎస్ రద్దుపై హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ కమిటీ ఏర్పాటు చేయడం వెనుక అసలు కారణం ఏమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డుల పథకం పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం, పెన్షనర్ల బకాయిల విడుదలలోనూ ఎప్పటిలాగే కాలయాపన జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సహనాన్ని ప్రభుత్వం బలహీనతగా భావిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని దేవీప్రసాద్ హెచ్చరించారు. అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన ప్రభుత్వం, ఉద్యోగుల సమస్యలను కూడా నిర్లక్ష్యం చేస్తే.. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తమ ఓటు ద్వారా తగిన సమాధానం చెబుతారని స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం కాలయాపనకు స్వస్తి పలికి స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎలాంటి పరిపాలన సంక్షోభం తలెత్తకుండా ఉండాలంటే సీఎం స్వయంగా నేరుగా చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు.



ఉస్మానియా హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలి

హైదరాబాద్,, సెప్టెంబర్ 21 :

ఉస్మానియా వర్సిటీలో విద్యార్థుల హాస్టల్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, సంప్రదాయ బద్ధంగా హుస్సేన్ సాగర్ వేదికగా జరిగే గణేష్ నిమజ్జనాలకు ప్రభుత్వం అనుమతినిచ్చి, సకల సౌకర్యాలు కల్పించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు డిమాండ్ చేశారు. నవరాత్రి ఉత్సవాల వేళ ఉస్మానియా విశ్వవిద్యాలయం తనదైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని చాటుకుంటోందని, క్యాంపస్‌లోని ప్రతీ హాస్టల్‌లో విద్యార్థులు వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని ఆయన అన్నారు. తాను చదివిన 'ఈ' హాస్టల్, ఓల్డ్ పీజీ హాస్టళ్లను సోమవారం సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా పరిశోధక విద్యార్థులుండే ఓల్డ్ పీజీ హాస్టల్ నుండి దాదాపు 15మంది విద్యార్థులు పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌లు, ఐసీహెచ్ఆర్ అర్హతలు సాధించడం గర్వకారణమని, వారందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. అయితే విద్యార్థుల వసతి విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోందన్నారు 'ఈ' హాస్టల్ విద్యార్థులను ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకుండా బలవంతంగా 'సి' హాస్టల్‌కు మార్చడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓయూ అభివృద్ధికి రూ.1000 కోట్లు ఇస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఆ నిధుల ఊసే ఎత్తకపోవడం శోచనీయమన్నారు. విద్యాశాఖ బాధ్యతలు కూడా ముఖ్యమంత్రి వద్దే ఉన్నందున తక్షణమే ఆ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శిథిలావస్థకు చేరిన పాత హాస్టళ్ల స్థానంలో అత్యాధునిక వసతి గృహాలను నిర్మించాలని, ప్రస్తుత భవనాలకు తక్షణ మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని కోరారు.

హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనోత్సవాలు నిలిపియవేడం శోచనీయం

హైదరాబాద్ నగరంలో దశాబ్దాలుగా హుస్సేన్ సాగర్‌ను 'వినాయక సాగర్'గా భావించి భక్తులు నిమజ్జనోత్సవాలు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. ఈ ఏడాది ప్రధాన సాగర్‌లో నిమజ్జనాలను నిలిపివేసి బ్యాక్‌వాటర్స్ వైపు మళ్లించే ప్రయత్నాలను బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఖైరతాబాద్‌లోని 70 అడుగుల మహాగణపతి, కొత్తపేటలోని 73 అడుగుల విగ్రహాలతోపాటు నగరవ్యాప్తంగా లక్షకుపైగా విగ్రహాలు నిమజ్జనానికి తరలివస్తాయని తెలిపారు. భారీ క్రేన్లు, నిరంతర పారిశుధ్య పనుల ద్వారా విగ్రహాలను నిమజ్జనం చేసిన వెంటనే వ్యర్థాలను తొలగించి పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా నిర్వహించే వెసులుబాటు ఉందని పేర్కొన్నారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి చేస్తున్న న్యాయమైన డిమాండ్లకు బీజేపీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని రామచందర్ రావు తెలిపారు. ప్రజల మనోభావాలను గౌరవిస్తూ ప్రజాప్రతినిధులు, పోలీసు, ప్రభుత్వ యంత్రాంగ సమన్వయంతో ఉత్సవాలు సాఫీగా సాగేందుకు హుస్సేన్ సాగర్‌లోనే గణేష్ నిమజ్జనానికి అనుమతినివ్వాలని, అవసరమైన మౌలిక వసతులు, బందోబస్తు ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివి



- **పట్టణ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు చింత గోపాల్.**

సదాశివపేట. సెప్టెంబర్ 21. (సిరిన్యూస్)

ఆచార్యశ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా చేనేత సహకార సంఘం అధ్యక్షుడు చింత గోపాల్ ఆధ్వర్యంలో బాపూజీ విగ్రహమునకు పూలదండలు పూజా కార్యక్రమాలు సమర్పించి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా పట్టణ చేనేత సహకార సంఘం అధ్యక్షులు చింత గోపాల్ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యక్షులు చింత ఆనంద్ కుమార్, కార్యదర్శి చిల్వరి వెంకటేశం, డైరెక్టర్లు గోనె శంకర్, చిలువేరి రవికుమార్, గడీల ప్రభాకర్, రుమాండ్ల రాజు, ముర్ముర శ్రీనివాస్, డాకూరి అశోక్, చింతా ఆదర్శ్, మునిపల్లి రామకృష్ణ, పోలా విజయ్, గుణాల సత్యం, మధునాల నర్సింలు, కొంగరి ప్రభు, తదితర పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.



సమయానికి బస్సుల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు



నారాయణఖేడ్, సెప్టెంబర్ 21 (సిరిన్యూస్)

పాఠశాల, కళాశాల సమయాలకు అనుగుణంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు సోమవారం మనూరు మండలం బెల్లాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. బాధలగామ, బెల్లాపూర్, పులుకుర్తి, దోసపల్లి గ్రామాలకు చెందిన విద్యార్థులు ఆందోళనలో పాల్గొన్నారు.నారాయణఖేడ్ నుంచి పులుకుర్తి వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక బస్సులు నడపాలని కోరారు. బస్సు సౌకర్యం లేక పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న మనూరు ఎస్సై కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. ఆర్టీసీ అధికారులను ఫోన్‌లో సంప్రదించి సమస్యను వివరించారు. విద్యాసంస్థల సమయాలకు అనుగుణంగా ప్రత్యేక బస్సు నడిపించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నా విరమించారు.

ఫామ్ హౌస్ సర్వేపై బీఆర్ఎస్ కౌంటర్

హైదరాబాద్, సెప్టెంబర్ 21:

కేసీఆర్ కుటుంబానికి చెందిన ఫామ్‌హౌస్‌లపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలకు బీఆర్ఎస్ కౌంటర్ ఇచ్చింది. బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ కాంగ్రెస్ నేతలకు చెందిన ఫామ్‌హౌస్‌లు, ఆస్తుల వివరాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. కాంగ్రెస్ పాలనలోని వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రైవేట్ ఆస్తుల అంశాన్ని తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు.

కాంగ్రెస్ నేతల ఆస్తులపై ప్రస్తావన

వట్టినాగులపల్లిలో 111 జీవో పరిధిలో సీఎం రేవంత్ రెడ్డి ఫామ్‌హౌస్ ఉందని క్రిశాంక్ పేర్కొన్నారు. హిమాయత్‌సాగర్‌లో 111 జీవో పరిధిలోనే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇల్లు, డాక్టర్ వివేక్ వెంకటస్వామి ఫామ్‌హౌస్ ఉన్నాయని తెలిపారు. గుత్తా సుఖేందర్ రెడ్డి ఫామ్‌హౌస్కూడా 111 జీవో పరిధిలోనే ఉందని పేర్కొన్నారు. కొత్వాల్‌గూడలో అసైన్డ్ భూమిలో పట్నం మహేందర్ రెడ్డి ఫామ్‌హౌస్ నిర్మించారని ఆరోపించారు.

కొత్తవాల్‌గూడలో అటవీ భూమిలో ప్రకాష్ గౌడ్ నివాసం ఉందని, వేం నరేందర్ రెడ్డికి అసైన్డ్ భూమి ఉందని తెలిపారు. రెడ్డిపల్లిలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఫామ్‌హౌస్ ఉన్నట్లు తన పోస్టులో ప్రస్తావించారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేట్ ఆస్తుల్లోకి ప్రతినిధి బృందాలతో వెళ్లి రాజకీయాలు చేస్తోందని క్రిశాంక్ విమర్శించారు. బీఆర్ఎస్ కూడా అదే
విధానాన్ని అనుసరిస్తే కాంగ్రెస్ నేతలకు సంబంధించిన ఆస్తుల జాబితా చాలా పెద్దదిగా ఉంటుందని వ్యాఖ్యానించారు. ప్రైవేట్ ఆస్తుల అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవడం మానుకుని తెలంగాణ ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు.



రామ మందిర విరాళాల చోరీ కేసులో నిందితుల గుర్తింపు

- 25న చార్జిషీటు దాఖలు

లక్నో, సెప్టెంబర్ 21:

సంచలనం సృష్టించిన అయోధ్య రామ మందిరం విరాళాల చోరీ కేసు కు సంబంధించి విచారణ తుది దశకు చేరుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితులను గుర్తిం చినట్లు ప్రత్యేక విచారణ బృందం (సిట్) వెల్ల డించింది. ఈనెల 25న ఈ కేసుకు సంబం ధించి చార్జిషీటు దాఖలు చేయను న్నట్లు సిట్ స్పష్టం చేసింది. అయోధ్య రామ మందిరం వి రాళాల చోరీ ఉదంతంపై ఉత్తరప్రదేశ్ ప్రభు త్వం ప్రత్యేక విచారణ బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు స్వ యంగా ఈ సిట్ వి చారణను పర్యవేక్షిస్తోంది. ఇందులో భాగంగా సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూ ర్తి జస్టిస్ సూర్యకాంత్ ధ ర్మా స నం ముందు ఈ కేసుకు సంబంధించిన స్టేట స్ రిపోర్టును సిట్ సమర్పించింది. సిట్ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టులో వాదనలు వినిపించారు.

సేకరించిన ఆధారాలు ఇవే

ఈ కేసు విచారణలో భాగంగా సీసీటీవీ ఫుటే జ్ను పరిశీలించడంతో పాటు అన్ని ఆధారా లను సిట్ సేకరించింది. ఈ వ్యవహారంలో గల్లంతైన డబ్బును, ఇతర విలువైన వస్తువుల ను సిట్ గుర్తించి స్వాధీనం చేసుకుంది. సేక రించిన ఆస్తులను ఎస్బీఐ లాకర్లలో భద్రప రిచారు. విచారణలో సాక్ష్యాలుగా ఉపయోగ పడే తగిన డాక్యుమెంట్లు, ఎలక్ట్రానిక్ ఎవిడె న్సు సిట్ సాధించింది. డొనేషన్ల డొనేషన వివరాలు, రసీదులు, సంబంధిత పత్రాలతో లతో పాటు సాఫ్ట్ వేర్ వివరాలు కూడా సిట్ వద్ద ఉన్నాయి.

10 ఏళ్ల బాలికపై లైంగిక దాడి

- ఢిల్లీలోని సదర్‌బజార్‌లో దారుణ ఘటన
- స్టేషనరీ కోసం వెళ్లిన బాలికపై అఘాయిత్యం
- కాళ్లు, చేతులు కట్టేసి దాడికి పాల్పడిన నిందితుడు
- అత్యాచారం, పోక్సో, కిడ్నాప్ సెక్షన్ల కింద కేసు
- 56 ఏళ్ల నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21:

దేశ రాజధాని ఢిల్లీలోని సదర్‌బజార్ ప్రాంతంలో 10 ఏళ్ల బాలికపై లైంగిక దాడి జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఆరో తరగతి చదువుతున్న బాలిక స్టేషనరీ వస్తు వులు కొనుగోలు చేసేందుకు బయటకు వెళ్లిన సమయంలో ఓ దుకాణంలోకి తీసు కెళ్లి నిందితుడు ఆమె కాళ్లు, చేతులు కట్టేసి అఘాయిత్యానికి పాల్పడినట్లు వెల్లడించా రు.

ఫిర్యాదుతో కేసు నమోదు

బాధిత బాలిక ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. అత్యా చారం, పోక్సో చట్టంతో పాటు కిడ్నాప్‌కు సంబంధించిన పలు తీవ్రమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నిందితుడి అరెస్ట్

ఘటనకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదు ర్కొంటున్న 56 ఏళ్ల వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. బాలిక మైనర్ కావడంతో చట్టపరమైన నిబంధనల ప్రకారం ఆమెకు సంబంధించిన వివరాలను పోలీసులు వెల్ల డించలేదు. కేసులో తదుపరి దర్యాప్తు కొన సాగుతోందని అధికారులు తెలిపారు.



మాస్కోపై డ్రోన్ల దండయాత్ర

- రష్యా పార్లమెంటరీ ఎన్నికల చివరి రోజున భారీ దాడి
- మాస్కో వైపు వచ్చిన 450 డ్రోన్లను కూల్చివేసినట్లు సోబ్యానిన్ వెల్లడి
- చమురు శుద్ధి కర్మాగారం, నివాస భవనాలపై శకలాల ప్రభావం
- ప్రతిదాడిగా కైవ్ సహా ఉక్రెయిన్ నగరాలపై రష్యా దాడులు

మాస్కో, సెప్టెంబర్ 21:

రష్యా పార్లమెంటరీ ఎన్నికల పోలింగ్ చివరి రోజున మాస్కో, పరిసర ప్రాంతాలపై ఉక్రెయిన్ భారీ డ్రోన్ దాడికి పాల్పడింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు రష్యా భూభాగం వైపు 1,600కు పైగా డ్రోన్లు వచ్చినట్లు, వాటిలో 450 మాస్కోను లక్ష్యంగా చేసుకున్నాయని మాస్కో మేయర్ సెర్గీ సోబ్యానిన్ తెలిపారు. గగనతల రక్షణ వ్యవస్థలు భారీ సంఖ్యలో డ్రోన్లను కూల్చివే సినప్పటికీ.. కొన్ని డ్రోన్లు లక్ష్య ప్రాంతాలకు చేరుకున్నాయి.

చమురు కర్మాగారంలో మంటలు

మాస్కో ఆయిల్ రిఫైనరీలోని ఓ ప్రాంతం డ్రోన్ దాడిలో దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. కొన్ని డ్రోన్లు రిఫైనరీ ప్రాంగణం లో పడటంతో మంటలు చెలరేగాయి. ఓ డ్రోన్ నివాస భవనాన్ని తాకడంతో భారీగా నష్టం వాటిల్లింది. మాస్కో పరిధిలోని ఓ 21 అంతస్తుల భవనం నుంచి సుమారు 400 మందిని అధికారులు ఖాళీ చేయించారు. దాడుల్లో ఓ వృద్ధుడు, 44 ఏళ్ల మహిళ మృతి చెందగా.. 20 మంది గాయపడ్డారని స్థానిక అధికారులు వెల్లడించారు.

ఎన్నికలనే లక్ష్యంగా చేసుకున్నారా?

ఎన్నికల ప్రక్రియను దెబ్బతీసేందుకు ఈ దాడి జరిగినట్లు మాస్కో మేయర్ సోబ్యాని న్ ఆరోపించారు. అయితే దాడి ప్రభావం పోలింగ్‌పై పడలేదని రష్యా అధికారులు పేర్కొన్నారు. ఉక్రెయిన్ మాత్రం ఈ దాడిపై అధికారికంగా స్పందించలేదు. అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ మాత్రం రష్యా సైనిక చర్యకు నిధులు సమకూర్చే చమురు, లాజి స్టిక్స్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపారు.

టూ్యషన్ నుంచి వస్తున్న బాలికపై దారుణం

- జమూయ్‌లో విద్యార్థులను అడ్డగించి బాలికపై లైంగిక వేధింపులు
- బాలికను లాక్కెళ్లేందుకు నిందితుల యత్నం
- ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్
- ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు
- ఘటనపై రాహుల్‌గాంధీ ఆగ్రహం.. పోక్సో కింద కఠిన చర్యలకు డిమాండ్

జమూయ్, సెప్టెంబర్ 21:

బిహార్‌లోని జమూయ్‌లో ట్యూషన్ ముగించు కుని ఇంటికి వెళ్తున్న పదో తరగతి బాలికపై కొందరు యువకులు లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. బాలికతో పాటు స్కూటర్‌పై ఉన్న బాలుడిని అడ్డుకున్న నిందితులు.. ఆమెను వేధిస్తూ లాక్కెళ్లేందుకు ప్రయత్నించినట్లు తెలు స్తోంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర దుమారం రేగింది.

బహిరంగ రహదారిపై వేధింపులు

జమూయ్ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల లో చదువుతున్న బాలిక, బాలుడు శనివారం సాయంత్రం ట్యూషన్ ముగించుకుని స్కూట ర్‌పై ఇంటికి బయల్దేరారు. జమూయ్‌లఖిసరా య్ రహదారిపై కొందరు యువకులు వారిని అడ్డుకున్నారు. బాలికను వేధిస్తూ చేతులు వేయడంతో ఆమె భయంతో వదిలేయాలని వేడుకున్నట్లు వీడియోలో కనిపిస్తోంది. బాలుడి చొక్కా కాలర్ పట్టుకుని లాగడంతో పాటు బాలికను మరోవైపు తీసుకెళ్లేందుకు కొందరు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. బాలిక తప్పిం చుకునేందుకు ప్రయత్నించగా ముఖానికి ముసుగు ధరించిన వ్యక్తి ఆమెను వెంబడించి నట్లు వీడియోలో ఉంది. కొద్దిసేపటి తర్వాత బాలుడు వారి చెర నుంచి తప్పించుకుని బాలిక వద్దకు చేరుకున్నాడు. ఇద్దరూ స్కూటర్ వద్దకు వెళ్లి అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయ త్నించినా నిందితులు వారిని వెంబడించినట్లు వీడియోలో కనిపించింది. శనివారం రాత్రి సుమారు 7 గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు.

ముగ్గురు అరెస్ట్



వీడియో వైరల్ కావడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధిత విద్యా ర్థుల నుంచి వివరాలు సేకరించిన అనంతరం ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు జమూయ్ ఎస్పీ విశ్వజిత్ దయాళ్ తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

రాహుల్‌గాంధీ ఆగ్రహం

ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ స్పం దించారు. బాలికను వేధించి లాక్కెళ్లేందుకు ప్ర యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోక్సో చట్టం కింద నిందితుల పై చర్యలు తీసుకోవాలని కోరారు. సాయంత్రం వేళ బహిరంగ రహదారిపై బాలికకు భద్రత లేకపోవడంపై బిహార్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

'జంగిల్ రాజ్'గా చూడొద్దు

ఈ ఘటనను బిహార్ మంత్రి సునీల్ కుమార్ తీవ్రంగా ఖండించారు. జమూయ్ ఎస్పీతో మాట్లాడి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసు కునేలా చూస్తామని తెలిపారు. తప్పు చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. అయితే ఒక్క ఘటన ఆధారంగా మొత్తం బిహార్‌ను 'జంగిల్ రాజ్'గా చిత్రీకరించడం సరికాదని పేర్కొన్నారు

భారత్-న్యూజిలాండ్ ఎఫ్‌టీఏకు ముహూర్తం ఖరారు

- అక్టోబర్ 20 నుంచి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోకి
- విజయదశమి రోజు నుంచి 100 శాతం భారత ఉత్పత్తులకు సుంక రహిత ప్రవేశం
- వాణిజ్య బంధాల బలోపేతానికి ఒప్పందం కీలక మైలురాయన్న పీయూష్ గోయల్
- నాలుగైదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలని లక్ష్యం
- కేవలం తొమ్మిది నెలల్లోనే ఎఫ్‌టీఏ చర్చలు పూర్తి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21:

భారత్-న్యూజిలాండ్ మధ్య వాణిజ్య సంబంధా ల్లో కీలక ముందడుగు పడనుంది. ఇరు దేశాల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (FTA) అక్టోబర్ 20 నుంచి అమల్లోకి రానుంది. విజయదశమి సందర్భంగా ఒప్పందం అమల్లో కి వస్తుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. న్యూ ఢిల్లీలో న్యూజిలాండ్ వాణిజ్య, పెట్టుబడుల శాఖ మంత్రి టాడ్ మెక్లేతో సోమవారం నిర్వహించిన వర్చువల్ సమావేశంలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు.

100 శాతం ఉత్పత్తులకు సుంకం రహితం

ఎఫ్‌టీఏ అమల్లోకి వచ్చిన రోజు నుంచే భారత్ నుంచి న్యూజిలాండ్‌కు ఎగుమతి చేసే 100 శాతం ఉత్పత్తులకు సుంక రహిత ప్రవేశం లభిం చనుంది. ఈ ఒప్పందం రెండు దేశాల ఆర్థిక భా



గస్వామ్యంలో కీలక మైలురాయిగా నిలుస్తుంద ని పీయూష్ గోయల్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక సంబంధాలు ఇటీవలి కాలంలో మరింత బలోపేతమయ్యాయని తెలిపారు.

వాణిజ్యం రెట్టింపే లక్ష్యం

భారత్-న్యూజిలాండ్ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 రోడ్‌మ్యాప్‌లో భాగంగా వచ్చే నాలుగై దేళ్లలో దాదాపు రూ.35 వేల కోట్లకు రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు గోయల్ చెప్పారు. న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ భారత్ పర్యటన, ప్రధాని నరేంద్ర మోదీ 2026 జూలైలో న్యూజిలాండ్ పర్యటనతో ద్వైపాక్షిక సంబంధాలకు మరింత ఊతం లభించిందన్నా రు. నాలుగు దశాబ్దాల తర్వాత న్యూజిలాండ్‌లో భారత ప్రధానమంత్రి చేసిన తొలి పర్యటనగా మోదీ పర్యటన నిలిచిందని తెలిపారు.

ఏప్రిల్‌లో ఒప్పందంపై సంతకాలు

భారత్-న్యూజిలాండ్ ఎఫ్‌టీఏపై 2026 ఏప్రిల్ 27న న్యూఢిల్లీలో ఇరు దేశాలు సంతకాలు చేశాయి. కేవలం తొమ్మిది నెలల్లోనే చర్చలను పూర్తి చేసినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. ఒప్పందం అమల్లోకి రావడంతో ఇరు దేశాల మధ్య వస్తు, సేవల వాణిజ్యానికి మరింత ఊతం లభించే అవకాశం ఉంది.

ట్యాంక్‌బండ్‌పై మళ్లీ ఉద్రిక్తత

- హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనానికి బారికేడ్లు తొలగించిన ఉత్సవ సమితి
- పోలీసుల ఆంక్షలను వ్యతిరేకించిన భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి
- సంప్రదాయ నిమజ్జనాన్ని అడ్డుకోవడం సరికాదని నేతల ఆగ్రహం
- కాలుష్య నియంత్రణ కోసం ట్యాంక్‌బండ్‌పై పీవోపీ విగ్రహాల నిమజ్జనానికి ఆంక్షలు
- పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు భారీగా పోలీసుల మోహరింపు

హైదరాబాద్, సెప్టెంబర్ 21:

వినాయక నిమజ్జనోత్సవాల వేళ ట్యాంక్‌బం డ్‌పై మరోసారి ఉద్రిక్తత నెలకొంది. హుస్సే న్‌సాగర్‌లో విగ్రహాల నిమజ్జనాన్ని అడ్డుకునేం దుకు పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన ఇనుప బారికేడ్లను భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు తొలగించారు. అనంతరం శోభాయాత్రగా వచ్చిన పలువురు హుస్సేన్‌సాగర్‌లో విగ్రహాలను నిమజ్జనం చేయడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్ప డింది.

ఆంక్షలపై ఉత్సవ సమితి అభ్యంతరం

శతాబ్దాలుగా కొనసాగుతున్న నిమజ్జన సం ప్రదాయాన్ని నిలిపివేయడం ద్వారా భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిమజ్జనానికి అడ్డుగా ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్, బారికేడ్లను తొలగించారు. నిమజ్జ నోత్సవాల చివరి ఘట్టం సజావుగా సాగేందుకు ట్యాంక్‌బండ్‌పై ఆంక్షలను ఎత్తివేసి వాహనాల ను అనుమతించాలని డిమాండ్ చేశారు.

కాలుష్య నియంత్రణకు కోర్టు ఆదేశాలు

హుస్సేన్‌సాగర్‌లో కాలుష్యాన్ని తగ్గించేందుకు



తెలంగాణ హైకోర్టు గతంలో పలు ఆదేశాలు జారీ చేసింది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనం చేయకుండా చర్యలు తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలకు మాత్రమే అనుమతి ఇవ్వాలని స్పష్టం చేసింది. ఇతర విగ్రహాలను బేబీ పాండ్స్, ఎన్టీఆర్ మార్గ్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నిమజ్జన కేంద్రాల వైపు తరలించాలని సూచించింది. ఈ నేపథ్యంలోనే ట్యాంక్‌బండ్ ప్రధాన రహదారి నుంచి హుస్సేన్‌సాగర్‌లోకి వి గ్రహాలను తీసుకెళ్లకుండా అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేశారు.

భారీగా పోలీసుల మోహరింపు

ఉత్సవ సమితి నేతలు బారికేడ్లను తొలగించడం తో పోలీసులు అప్రమత్తమయ్యారు. ట్యాంక్‌బం డ్ పరిసరాల్లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో పాటు అదనపు పోలీసు బలగాలను మోహరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పరిస్థి తిని అదుపులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. కోర్టు ఆదేశాలు, ప్రభుత్వ సూచనలను పాటించా లని, నిబంధనలు ఉల్లంఘించవద్దని పోలీసులు ఉత్సవ సమితి నేతలకు సూచించారు.

సోనియా ఓటర్ లిస్ట్ కేసులో కీలక మలుపు

- ఎఫ్ఐఆర్‌పై మెజిస్ట్రేట్ ఆదేశాలను కొట్టివేసిన సెషన్స్ కోర్టు
- పిటిషన్‌పై మళ్లీ విచారణ జరపాలని ఆదేశం
- 1980 ఓటర్ జాబితాలో పేరు నమోదుపై ఫిర్యాదు
- 1983లో పౌరసత్వం పొందినట్లు పిటిషనర్ వాదన
- పోలీసుల వాదనలు, స్టేటస్ రిపోర్టు తీసుకోలేదన్న కోర్టు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21:

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి సంబం ధించిన ఓటర్ జాబితా వ్యవహారంలో ఢిల్లీ సెషన్స్ కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. భారత పౌరసత్వం పొందకముందే ఆమె పేరు ఓటర్ జాబితాలో నమోదైందంటూ దాఖలైన ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ని రాకరిస్తూ మెజిస్ట్రేట్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సోమవారం కొట్టివేసింది. అయితే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నేరుగా ఆదేశించకుండా.. ఫిర్యాదును చట్ట ప్రకారం మరోసారి పరిశీలించి కారణాలతో కూడిన ఉత్తర్వులు ఇవ్వాలని మెజి స్ట్రేట్ కోర్టును ఆదేశించింది.

మళ్లీ విచారణకు ఆదేశం

రౌస్ అవెన్యూ కోర్టుల సెంట్రల్ ఢిల్లీ కోర్ట్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, న్యాయవాది వికాస్ త్రిపాఠి ఈ ఫిర్యాదును దాఖలు చేశారు. సోనియా గాంధీ పేరు 1980లో న్యూఢిల్లీ ని యోజకవర్గ ఓటర్ జాబితాలో నమోదైందని, ఆమె 1983లో భారత పౌరసత్వం పొందినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఎఫ్ఐ ఆర్ నమోదు చేసి దర్యాప్తు చేయాలని ఆయన కోరారు. ఈ ఫిర్యాదును 2025 సెప్టెంబర్‌లో మెజిస్ట్రేట్ కోర్టు తిరస్కరించింది. దాన్ని సవాల్ చేస్తూ త్రిపాఠి సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. తాజాగా ప్రత్యేక న్యాయమూర్తి విషాల్ గోగ్నే మెజిస్ట్రేట్ ఉత్తర్వులను పక్కనపెట్టి, పిటిషన్‌పై కొత్తగా విచారణ జరపాలని ఆదేశించారు. ఈ వ్యవహారం తదుపరి విచారణకు సెప్టెంబర్ 29న రానుంది.

BNSS నిబంధనలపై కోర్టు అభ్యంతరం

భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (BNSS) లోని సెక్షన్ 175(3) ప్రకారం అనుసరించా ల్సిన ప్రక్రియను మెజిస్ట్రేట్ కోర్టు సరిగా పాటిం చలేదని సెషన్స్ కోర్టు పేర్కొంది. ముఖ్యంగా సంబంధిత పోలీసు అధికారి వాదనలు వినక పోవడం, పోలీస్ స్టేషన్ నుంచి స్టేటస్ రిపోర్టు తీసుకోకపోవడాన్ని ప్రస్తావించింది. ఫిర్యాదు లో సంజ్ఞేయ నేరం వెల్లడవుతోందా లేదా అనే ప్రధాన అంశాన్ని పరిశీలించకుండా మెజిస్ట్రేట్ కోర్టు పౌరసత్వ అంశంపై దృష్టి మళ్లించిందని కూడా సెషన్స్ కోర్టు పేర్కొంది.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.

సర్వీస్ రోడ్డుపై ఇసుక లారీల తొలగింపు

- హెచ్చరికలు.. ప్రమాదం.. ఆపై అధికారుల చర్యలు
- వరుస కథనాలకు స్పందన..
- ఇతర వాహనాల పార్కింగ్, రోడ్డుపై ఇసుకపైనా చర్యలు తీసుకోవాలి





www.siridaily.com

RNI TG TEL/ 26/A0381

సిరి

People's Voice వార్తపత్రిక

మంగళవారం
సెప్టెంబర్-22-2026

సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 257

పేజీలు : 5



కాలుష్యం స్థానికులకు.. నిధులు పక్కకు!

హత్నూర మండలంలో పరిశ్రమల విస్తరణ

- పెరుగుతున్న కాలుష్యం, అనారోగ్య బాధితులు
- కంపెనీల చట్టం సెక్షన్ 135 ప్రకారం స్థానిక ప్రాంతాలకే ప్రాధాన్యత
- కాలుష్య కోరల్లో చిక్కుకున్న 12కు పైగా ప్రభావిత గ్రామాలు
- గుండ్లమాచనూరు, బోరపట్లలో తీరని తాగునీరు, రోడ్ల సమస్యలు
- బడి, వైద్యం, పారిశుధ్యానికి అందని కార్పొరేట్ నిధులు
- కాగితాల్లో స్థానిక పనులు చూపి నిధులు దారిమళ్లిస్తున్న కంపెనీలు
- కాలుష్యానికి గురవుతున్న ప్రజల ఆరోగ్యానికి కనీస భరోసా కరవు
- జిల్లా కలెక్టర్, పరిశ్రమల శాఖ సమీక్ష చేపట్టాలని స్థానికుల డిమాండ్


5

(మహమ్మద్ జావెద్)
(హత్నూర-సిరిన్యూస్)


సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, ఆ అభివృద్ధి స్థానిక గ్రామాల ప్రజల పాలిట శాపంగా మారుతోంది. పరిశ్రమల స్థాపన కోసం విలువైన భూములు, అమూల్యమైన భూగర్భ జలాలు, రహదారులు తదితర స్థానిక వనరులను కంపెనీలు యథేచ్ఛగా వినియోగించుకుంటున్నాయి. అయితే వాటి నుంచి వెలువడే ప్రమాదకర రసాయన వ్యర్థాలు, విషవాయువులు, కాలుష్య దుష్ప్రభావాలను మాత్రం ఇక్కడి ప్రజలే నిత్యం భరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కంపెనీలు తమ లాభాల నుంచి చట్టబద్ధంగా ఖర్చు చేయాల్సిన కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు ఎటు పోతున్నాయనే ప్రశ్న మండలవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాలుష్యం మాత్రం స్థానికులకు ఇచ్చి, సీఎస్ఆర్ నిధులను మాత్రం ఇతర ప్రాంతాలకు తరలించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

జగ్గారెడ్డిని కలిసిన డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి

సంగారెడ్డి, సెప్టెంబర్ 21 : సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చంద్రశేఖర్ రెడ్డి నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని సంగారెడ్డి పట్టణంలోని రామ్‌నగర్ రామ్ మందిర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డిని జగ్గారెడ్డి ఘనంగా సన్మానించి అభినందించారు.



3



బలమైన ఆకాంక్షగా నియోజకవర్గ పోరాటం!

నియోజకవర్గ హోదా కోసం ఒక్కటవుతున్న రామాయంపేట ప్రజలు

రామాయంపేటకు తిరిగి అసెంబ్లీ నియోజకవర్గ హోదా సాధించాలన్న ఆకాంక్ష పార్టీలకతీతంగా బలపడుతోంది. రాజకీయ పార్టీలకు అతీతంగా కుల సంఘాలు, ప్రజా సంఘాలు, వివిధ వర్గాల ప్రజలు ఏకతాటిపైకి వచ్చి రామాయంపేటకు నియోజకవర్గ హోదా వచ్చేలా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ముందుగా రామాయంపేట రెవెన్యూ డివిజన్‌ను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి, పెండింగ్‌లో ఉన్న ప్రక్రియను ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

(డి.జి. శ్రీనివాస శర్మ)
(రామాయంపేట-సిరి న్యూస్)

రెవెన్యూ డివిజన్ సాధనతోనే నియోజకవర్గమంటున్న స్థానికులు

పూర్వ వైభవం రావాలంటే నియోజకవర్గం కావాల్సిందే

- డీ లిమిటేషన్‌లో కోల్పోయిన హోదా..
- మళ్లీ డీ లిమిటేషన్‌లోనే సాధించుకోవాలన్న పట్టుదల
- ప్రజా ఆకాంక్షను ప్రభుత్వం గుర్తించాలి..
- పూర్తిస్థాయి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి
- ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామంటున్న ప్రజాసంఘాలు
- ఆత్మ గౌరవ ప్రతీకగా నియోజకవర్గం సాధించే వరకు పోరాటమంటున్న నేతలు

4







సర్వీస్ రోడ్డుపై ఇసుక లారీల తొలగింపు

- హెచ్చరికలు.. ప్రమాదం.. ఆపై అధికారుల చర్యలు
- వరుస కథనాలకు స్పందన..
- ఇతర వాహనాల పార్కింగ్, రోడ్డుపై ఇసుకపైనా చర్యలు తీసుకోవాలి

రామచంద్రాపురం, సెప్టెంబర్ 21 (సిరి న్యూస్): ప్రమాదం జరగకముందే 'సిరి' హెచ్చరించింది.. సమస్యను పలుమార్లు వెలుగులోకి తెచ్చింది.. అయినా అప్పట్లో అధికారులు స్పందించలేదు. సర్వీస్ రోడ్డుపై ఇసుక లారీలను నిలిపి ఉంచడం, రోడ్డంతా ఇసుక పేరుకుపోవడం, ఇతర వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడంపై వరుస కథనాలు ప్రచురించింది. చివరకు ఇసుక లారీని రివర్స్ చేస్తుండగా ఓ వాకర్ మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది.ఈ ఘటన అనంతరం 'సిరి' మళ్లీ కథనాలతో సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో అధికారులు స్పందించి సర్వీస్ రోడ్డుపై నిలిపి ఉంచిన ఇసుక లారీలను తొలగించారు.దీంతో కొంతమేర రహదారిపై వెసులుబాటు కలిగింది.అయితే సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదని స్థానికులు చెబుతున్నారు. కంపెనీ బస్సులు, షోరూమ్ కార్లు, ద్విచక్ర వాహనాలను కూడా అడ్డదిడ్డంగా నిలిపివేస్తున్నారని, రోడ్డుపై పేరుకుపోయిన ఇసుకతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు. వాటిపైనా అధికారులు చర్యలు తీసుకుని సర్వీస్ రోడ్డును ప్రజలకు ఇబ్బందులు లేకుండా తీర్చిదిద్దాలని కోరుతున్నారు. ఇ క పై వాహనాల నిలుపుదలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, రోడ్డుపై ఇసుక పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.












నిజమేనా... ఆకతాయిల పనా?

ఎర్రటి కరపత్రంతో తూప్రాన్ లో కలకలం

తూప్రాన్ మున్సిపల్ కార్యాలయ గేటుకు అతికించిన ఘటన

తూప్రాన్, సెప్టెంబర్ 21 (సిరిన్యూస్) : తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం గేటుకు సోమవారం ఏపీటిహెచ్ కార్యాలయం ప్రధాన గేటుకు గుర్తుతెలియని వ్యక్తులు ఎర్రటి వస్త్రాన్ని కట్టి ఓ లేఖను ఉంచి వెళ్లారు. ఆ లేఖలో 10 మంది విప్లవ యోధులకు ఉరిశిక్ష విధించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ పలు అంశాలను ప్రస్తావించారు. లేఖను గుర్తించిన మున్సిపల్ సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు లేఖను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. లేఖను ఎవరు ఉంచారు? దీని వెనుక ఎవరున్నారు? అనే విషయాలపై ఆరా తీస్తున్నారు. మున్సిపల్ కార్యాలయం గేటుకు ఎర్రటి వస్త్రం కట్టి లేఖను ఉంచిన ఘటనతో పాటు తూప్రాన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో అలాంటిదే మరో లేఖను వదిలి వెళ్ళిన ఈ ఘటనకు సంబంధించినది ఎవరనేది పూర్తి వివరాలను సేకరిస్తూ కరపత్రాలను ఎవరు ఏర్పాటు చేశారనే విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు తూప్రాన్ ఎస్ఐ గంగరాజు తెలిపారు.



రామాయంపేట కు చేరుకున్న విశ్వకర్మ ఏక్తా యాత్ర

ఘన స్వాగతం పలికిన విశ్వకర్మ కులస్తులు

రామాయంపేట, సెప్టెంబర్ 21 (సిరి న్యూస్) విశ్వకర్మల ఐక్యత, హక్కులు, అభివృద్ధి కోసం హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకు కొనసాగుతున్న విశ్వకర్మ ఏక్తా యాత్ర మెదక్ జిల్లా రామాయంపేటకు సోమవారం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక విశ్వకర్మ కులస్తులు యాత్ర బృందానికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ విశ్వనాథుల పుష్పగిరి మాట్లాడుతూ..ప్రపంచంలోనే అత్యధికంగా ఆకలి చావులు, ఆత్మహత్యలతో అల్లాడుతున్న కుటుంబాల్లో స్వర్ణకార కుటుంబాలు కూడా ఉన్నాయని అన్నారు. స్వర్ణకారుల సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకు పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. బంగారం ధరలు పెరగడం, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారుల కారణంగా స్థానిక స్వర్ణకారులు తమ కులవృత్తిని కోల్పోతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వారిని రక్షించడంతో పాటు వృత్తికి భరోసా కల్పించడమే విశ్వకర్మ ఏక్తా యాత్ర ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విశ్వకర్మసమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, 25 డిమాండ్ల సాధన కోసం యాత్ర కొనసాగుతోందన్నారు. సంప్రదాయ వృత్తులను కాపాడు తూ ఆధునిక సాంకేతికత, నైపు ణ్యం, మార్కెట్ అవకాశాలతో విశ్వకర్మలను ఆర్థికంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనంతరం యాత్ర బృందం ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహం వద్దకు చేరుకుని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించింది. జయశంకర్ సార్ ఆశయాలను స్మరించుకుంటూ సామాజిక అభివృద్ధి, ఐక్యత కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా ప్రతినిధులు పేర్కొన్నారు. అక్కడి నుంచి విశ్వకర్మ ఏక్తా యాత్ర పాదయాత్రగా ముందుకు సాగింది. రామాయంపేటలో యాత్రకు విశ్వకర్మ కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సంఘీభావాన్ని తెలిపా రు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకోజు దామోదర్, మండల నాయకులు ఎల్లిది లక్ష్మీనారాయణ, రామ కృష్ణ చారి, పూర్ణ రవి చారి, వేణుమాధవ్, తదితరులు పాల్గొన్నారు.





జగ్గారెడ్డిని కలిసిన డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి

సంగారెడ్డి, సెప్టెంబర్ 21 : సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చంద్రశేఖర్ రెడ్డి నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని సంగారెడ్డి పట్టణంలోని రామ్‌నగర్ రామ్ మందిర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డిని జగ్గారెడ్డి ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ నిర్మలా జగ్గారెడ్డి డీసీసీ అధ్యక్షురాలిగా ఏడు సంవత్సరాలకు పైగా సుదీర్ఘకాలం పనిచేశారని తెలిపారు. ఆమె హయాంలో జిల్లా కేంద్రంలో ఏ విధంగా పార్టీ కార్యక్రమాలను నిర్వహించామో, అంతకంటే ఎక్కువగా చంద్రశేఖర్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. చంద్రశేఖర్ రెడ్డికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. నూతన డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తనను డీసీసీ అధ్యక్షుడిగా ఎంపిక చేయడంలో సహకరించిన మంత్రి దామోదర్ రాజనర్సింహా, ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

అధిష్టానానికి కృతజ్ఞతలు: ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ తన తమ్ముడు చంద్రశేఖర్ రెడ్డిపై నమ్మకంతో డీసీసీ అధ్యక్షుడిగా నియమించిన ఏఐసీసీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే చంద్రశేఖర్ రెడ్డి ఎంపికకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహా, జగ్గారెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరి సహకారంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.


ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంగారెడ్డి జిల్లా శాఖ ఎన్నికలకు నోటిఫికేషన్

సంగారెడ్డి, సెప్టెంబర్ 21 (సిరిన్యూస్) : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంగారెడ్డి జిల్లా శాఖ నిర్వహణ కమిటీ ఎన్నికలను అక్టోబర్ 4, 2026న నిర్వహించ నున్నట్లు ఎన్నికల అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు శివప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి జిల్లా శాఖకు చెందిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుల జాబితాను ఇప్పటికే ప్రచురించినట్లు, సభ్యులందరికీ ఎన్నికల కార్యక్రమానికి సంబంధించిన సమాచారాన్ని తెలియజేసినట్లు ఆయన తెలిపారు. నిర్వహణ కమిటీ సభ్యుల పదవులకు నామినేషన్ల స్వీకరణ సెప్టెంబర్ 24న ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు కలెక్టరేట్‌లోని ఎన్నికల అధికారి కార్యాలయంలో జరుగుతుందని తెలిపారు. సెప్టెంబర్ 25న ఉదయం 10.00 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన నిర్వహించి, చెల్లుబాటు అయ్యే నామినేషన్ల జాబితాను ప్రచురిస్తామని పేర్కొన్నారు. సెప్టెంబర్ 26న ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని, అనంతరం తుది నామినేషన్ల జాబితాను ప్రచురించి, అభ్యర్థులకు ఎన్నికల గుర్తులను కేటాయిస్తామని తెలిపారు. అవసరమైన పక్షంలో అక్టోబర్ 4, 2026న ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల అధికారి తెలిపారు. ఆరోజు ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, సాయంత్రం 4.00 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతామని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం ఫలితాలను ప్రకటిస్తామని, ఫలితాల ప్రకటన అనంతరం ఆఫీస్ బేరర్ల ఎన్నిక నిర్వహిస్తామని వెల్లడించారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు రూ.10,000 తిరిగి చెల్లించబడని రుసుము (నాన్‌రిఫండబుల్)గా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. నామినేషన్ ఫారాలను ఎన్నికల అధికారిని వ్యక్తిగతంగా సంప్రదించడం ద్వారా లేదా ఎన్నికల అధికారికి రాతపూర్వకంగా అభ్యర్థన సమర్పించి, అధీకృత వ్యక్తి ద్వారా సెప్టెంబర్ 24న ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఎన్నికల అధికారి ఫోన్ నంబర్ 994999 2039ను సంప్రదించాలని సూచించారు. ఎన్నికల రోజున పోలింగ్ కేంద్రానికి వచ్చే సభ్యులు గుర్తింపు నిమిత్తం సొసైటీ జారీ చేసిన ఫోటో గుర్తింపు కార్డుతో పాటు ఫోటో గుర్తింపు నకు సంబంధించిన ఇతర ఆధారాన్ని తప్పని సరిగా వెంట తీసుకురావాలని ఎన్నికల అధికారి శివప్రసాద్ కోరారు.

కనిపించని కన్న బిడ్డలు

జిన్నారం సెప్టెంబర్ 21 సిరి న్యూస్ ఐడిఏ బొల్లారం సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు చిన్నారులు, వేర్వేరు ప్రాంతాల నుంచి అదృశ్యమైన ఘటనలు స్థానికంగా తీవ్ర కలకలం రేపాయి. కంటికి రెప్పలా చూసుకుంటున్న కన్న బిడ్డలు కనిపించకుండా పోవడంతో, వారి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. బాలాజీ నగర్ కు చెందిన జితేంద్ర కుమార్ బర్మా కుమారుడు, సందీప్ కుమార్ (12) బొల్లారం పబ్లిక్ స్కూల్లో నాలుగవ తరగతి చదువుతున్నాడు, ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఇంట్లోనే ఉన్న బాలుడు, సాయంత్రం ఐదు గంటలకు తండ్రి విధులు ముగించుకుని ఇంటికి వచ్చేసరికి కనిపించకుండా పోయాడు,ధరించిన దుస్తులు గులాబీ రంగు చొక్కా, జీన్స్ ప్యాంటు,ధరించండి అని తెలిపారు. కాజిపల్లి జిఎంఆర్ కాలనీకి చెందిన రింకూ దేవి కుమారుడు ఆన్మోల్ (10) గత ఎనిమిది రోజులుగా కనిపించకుండా పోయాడు తల్లి పనికి వెళ్లిన సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలుడు అదృశ్యమయ్యాడు,గతంలో కూడా బాలుడు ఒకటి రెండు సార్లు ఇంట్లోంచి వెళ్లి తిరిగి వచ్చిన దృష్ట్యా ఈసారి కూడా వస్తాడని భావించినా, జాడ లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారని తెలిపారు. ధరించిన దుస్తులు, తెల్లటి చొక్కా, షార్టు వేసుకున్నాడని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు సిఐ సుధీర్ కుమార్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం అని తెలిపారు. ఈ బాలుర ఆచూకీ తెలిపిన వారు లేదా ఎలాంటి అనుమానాస్పద సమాచారం ఉన్నవెంటనే ఐడియా బొల్లారం పోలీస్ స్టేషన్ సంప్రదించాలని సిఐ కోరారు.





డివిజన్ ఉద్యమానికి మించి ఉద్యమిస్తాం సుంకోజు దామోదర్ చారి, జేఏసీ నాయకుడు

రామాయంపేట నియోజకవర్గం డిలిమిటేషన్ లో పోయిన దాన్ని, అదే డీ లిమిటేషన్ లో సాధించుకోవడం కోసం ఎలాంటి ఉద్యోమానికైనా సిద్ధం. నేను వ్యక్తిగతంగా రామాయంపేట రెవెన్యూ డివిజన్ కోసం ఉద్యమం చేశామో, అంతకంటే పెద్ద ఎత్తున శాసనసభ నియోజకవర్గాన్ని కోసం ఉద్యమిస్తాం.

బలమైన ఆకాంక్షగా నియోజకవర్గ పోరాటం !

నియోజకవర్గ హోదా కోసం ఒక్కటవుతున్న రామాయంపేట ప్రజలు

- రెవెన్యూ డివిజన్ సాధనతోనే నియోజకవర్గమంటున్న స్థానికులు
- పూర్వ వైభవం రావాలంటే నియోజకవర్గం కావాల్సిందే..
- ఉద్యమాన్ని ఉధృతం చేస్తామంటున్న ప్రజాసంఘాలు

రామాయంపేటకు తిరిగి అసెంబ్లీ నియోజకవర్గ హోదా సాధించాలన్న ఆకాంక్ష పార్టీలకతీతంగా బలపడుతోంది. రాజకీయ పార్టీలకు అతీతంగా కుల సంఘాలు, ప్రజాసంఘాలు, వివిధ వర్గాల ప్రజలు ఏకతాటిపైకి వచ్చి రామాయంపేటకు నియోజకవర్గ హోదా వచ్చేలా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ముందుగా రామాయంపేట రెవెన్యూ డివిజన్‌ను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి, పెండింగ్‌లో ఉన్న ప్రక్రియను ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అనంతరం జరిగే నియోజకవర్గాల పునర్విభజనలో రామాయంపేటను ప్రత్యేక అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు చేసేలా అన్ని వర్గాలు సమష్టిగా కృషి చేయాలని కోరుతున్నారు. ఇది ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించిన డిమాండ్ కాదని, రామాయంపేట ప్రాంత భవిష్యత్ అభివృద్ధికి సంబంధించిన ప్రజా ఆకాంక్ష అని స్థానికులు చెబుతున్నారు. గతంలో నియోజకవర్గ హోదా కోల్పోయిన రామాయంపేటకు తిరిగి ఆ హోదా దక్కితే ప్రభుత్వ కార్యాలయాలు, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు పెరిగి ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవడంతో పాటు, పునర్విభజనలో రామాయంపేట నియోజకవర్గం ఏర్పాటుకు అనుకూలంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ డిమాండ్ కోసం కుల సంఘాలు, ప్రజాసంఘాలు, అన్ని రాజకీయ పార్టీలూ సమన్వయంతో ముందుకు కదలడానికి సిద్ధమవుతున్నాయి.

(డి.జి. శ్రీనివాస శర్మ)
(రామాయంపేట-సిరి న్యూస్)

నియోజకవర్గం కోసం పోరాటాలు చేస్తాం..
మెట్టు గంగారం, జిల్లా వ్యవస్థాపక అధ్యక్షులు బీసీ సంక్షేమ సంఘం



రామాయంపేట నియోజకవర్గాన్ని తిరిగి సాధించుకోవడానికి మా ప్రజలతో కలిసి ఏ త్యాగానికైనా సిద్ధమే....రామాయంపేట వచ్చుడో గంగన్న సచ్చుడో అనే విధంగా పోరాటం చేస్తాం.. వదిలిపెట్టే ప్రసక్తే లేదు..

రెవిన్యూ డివిజన్ కొనసాగించకపోవడం దురదృష్టకరం.
బాదే చంద్రం, రామాయంపేట పీఏసీఎస్ చైర్మన్



ప్రజల అభీష్టం మేరకు బీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ రెవెన్యూ డివిజన్ ప్రకటించారు. మంత్రి హరీష్ రావు చేతుల మీదుగా డివిజన్ కార్యాలయం కూడా ప్రారంభించాం. అధికారం కోల్పోవడం వల్ల దాన్ని కొనసాగించలేకపోయాం. కాంగ్రెస్ పార్టీ,స్థానిక ఎమ్మెల్యే రెవెన్యూ డివిజన్ కొనసాగించకపోవడం దురదృష్టకరం.ప్రజల అభీష్టమేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసి రామాయపేట ప్రజల కళా నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నాం.

అభివృద్ధి కుంటుపడింది...
పంజా విజయ్, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్



రామాయంపేట నియోజకవర్గం కోల్పోవడంతో ఉమ్మడి మండలంలో అభివృద్ధి కుంటుపడింది.నియోజకవర్గ సాధన కోసం కలిసికట్టుగా పని చేస్తాం.ఇప్పుడు కాకుంటే మరెప్పుడూ నియోజకవర్గం రాదు. రామాయంపేట అభివృద్ధి జరగాలంటే నియోజకవర్గ సాధనే లక్ష్యం.

డివిజన్ తోనే నియోజకవర్గ ఏర్పాటుకు మార్గం సుగమం...
పాతూరి రాజు,
ఎమ్మార్పీఎస్ నాయకులు



రామయంపేట రెవెన్యూ డివిజన్ పూర్తిస్థాయి లో ఏర్పాటు అయితే, నియోజకవర్గం ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుంది. ప్రజా సంఘాలతో కలిసి, రెవెన్యూ డివిజన్, నియోజకవర్గం ఏర్పాటుకు ఉద్యమాలు చేస్తాం. ప్రభుత్వం, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యే స్పందించాల్సిన అవసరం ఉంది

ఎమ్మెల్యే సహకారంతో నియోజకవర్గం ఏర్పాటవుతుంది...
గజవాడ లావణ్య నాగరాజు, మున్సిపల్ చైర్మన్



ఎమ్మెల్యే రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహకారంతో రెవిన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి చేస్తాం. రెవిన్యూ డివిజన్ ఏర్పాటు తోనే రామాయంపేట పూర్వ వైభవం సంతరించుకుంటుంది. ప్రజల అభీష్టం మేరకు కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయి రెవిన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి చేస్తుంది.

రామాయంపేట నియోజకవర్గానికి రెవెన్యూ డివిజన్ కీలకం...
ఎస్.కె అహ్మద్, బిఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ



రామాయంపేట భవిష్యత్‌లో నియోజకవర్గం కావాలంటే, పూర్తిస్థాయి రెవెన్యూ డివిజన్ కావాలి. అప్పటి సీఎం కేసీఆర్ మెదక్ పర్యటనలో రామాయంపేట రెవెన్యూ డివిజన్ ప్రకటించారు. కార్యాలయం ఏర్పాటు చేసి ఫర్నిచర్, కంప్యూటర్లు సమకూర్చడంతో పాటు తూప్రాన్ ఆర్డీవోను ఇన్‌చార్జి ఆర్డీవోగా నియమించారు.గతంలో రెవెన్యూ డివిజన్ తీసుకొస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే,, ఆ హామీని నెరవేర్చాలి. ముఖ్యమంత్రితో మాట్లాడి గెజిట్ విడుదల చేయించాలి. అప్పట్లో డివిజన్ కోసం పోరాడిన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నాం.

నియోజకవర్గం – మా ఆత్మగౌరవానికి ప్రతీక.
రాగి రాములు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

రామాయంపేటను నియోజకవర్గంగా ఏర్పాటు చేయడం ఇక్కడి ప్రజల చిరకాల ఆకాంక్ష. ఇది కేవలం రాజకీయ డిమాండ్ కాదు – మన ప్రాంత ఆత్మగౌరవానికి ప్రతీక.రామాయంపేట అభివృద్ధి వేగవంతం కావాలంటే ప్రత్యేక నియోజకవర్గం ఎంతో అవసరం.ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం గుర్తించి వెంటనే నియోజకవర్గ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించాలి.రామాయంపేట నియోజకవర్గం సాధించే వరకు ప్రజల పక్షాన మా పోరాటం ఆగదు.

రెవెన్యూ డివిజన్‌పై పాలకుల నాన్చుడు ధోరణి...
వెలుముల సిద్ధరాములు, రామాయంపేట జేఏసీ కన్వీనర్, మాజీ ఎంపీటీసీ



ప్రభుత్వాలు మారుతున్నా రామాయంపేట రెవెన్యూ డివిజన్ సమస్యకు పరిష్కారం లభించడం లేదు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రెవెన్యూ డివిజన్ విషయంలో ప్రజలను మోసం చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా వెయ్యి రోజులు గడిచినా హామీ అమలు కాలేదు. రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తాం.



కాలుష్యం స్థానికులకు.. నిధులు పక్కకు!

హత్నూర మండలంలో పరిశ్రమల విస్తరణ

- పెరుగుతున్న కాలుష్యం, అనారోగ్య బాధితులు
- కంపెనీల చట్టం సెక్షన్ 135 ప్రకారం స్థానిక ప్రాంతాలకే ప్రాధాన్యత
- కాలుష్య కోరల్లో చిక్కుకున్న 12కు పైగా ప్రభావిత గ్రామాలు
- గుండ్లమాచునూరు, బోరపట్లలో తీరని తాగునీరు, రోడ్ల సమస్యలు
- బడి, వైద్యం, పారిశుధ్యానికి అందని కార్పొరేట్ నిధులు
- కాగితాల్లో స్థానిక పనులు చూపి నిధులు దారిమళ్లిస్తున్న కంపెనీలు
- కాలుష్యానికి గురవుతున్న ప్రజల ఆరోగ్యానికి కనీస భరోసా కరవు
- జిల్లా కలెక్టర్, పరిశ్రమల శాఖ సమీక్ష చేపట్టాలని స్థానికుల డిమాండ్

(మహమ్మద్ జావెద్)
(హత్నూర-సిరిన్యూస్)

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, ఆ అభివృద్ధి స్థానిక గ్రామాల ప్రజల పాలిట శాపంగా మారుతోంది. పరిశ్రమల స్థాపన కోసం విలువైన భూములు, అమూల్యమైన భూగర్భ జలాలు, రహదారులు తదితర స్థానిక వనరులను కంపెనీలు యథేచ్ఛగా వినియోగించుకుంటున్నాయి. అయితే వాటి నుంచి వెలువడే ప్రమాదకర రసాయన వ్యర్థాలు, విషవాయువులు, కాలుష్య దుష్ప్రభావాలను మాత్రం ఇక్కడి ప్రజలే నిత్యం భరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కంపెనీలు తమ లాభాల నుంచి చట్టబద్ధంగా ఖర్చు చేయాల్సిన కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు ఎటు పోతున్నాయనే ప్రశ్న మండలవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాలుష్యం మాత్రం స్థానికులకు ఇచ్చి, సీఎస్ఆర్ నిధులను మాత్రం ఇతర ప్రాంతాలకు తరలించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

కంపెనీల దాటవేత ధోరణి..

కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం, కంపెనీల చట్టంలోని సెక్షన్ 135 కింద సీఎస్ఆర్ నిధులను ఖర్చు చేసేటప్పుడు కంపె నీలు తాము పనిచేస్తున్న స్థానిక ప్రాంతాలు, ప్రభావితపరిసరగ్రామాలకేతొలిప్రాధాన్యతఇవ్వాలని స్పష్టంగానిర్దేశించింది.అయితేఈనిబంధనను స్థానిక పరిశ్రమలు తుంగలో తొక్కుతున్నాయి. స్థానిక ప్రాధాన్యత అనేది చట్టపరంగా తప్పనిసరి భౌగోళిక పరిమితి కాదు అనే వెసులుబాటును అడ్డం పెట్టుకుని, లాభాలు ఆర్జిస్తున్నహత్నూరప్రాంతాన్నిగాలికొదిలేసి తమ అనుకూలమైన ప్రాంతాలకు, కార్పొరేట్ పెద్దల ఆదేశాల మేరకు దూరప్రాంతాలకు నిధులను మళ్లిస్తు న్నారనేవిమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కాలుష్య కోరల్లో 12కు పైగా గ్రామాలు..

హత్నూర మండల పరిధిలో గుండ్లమాచు నూరు, పల్సనూర్, బోరపట్ల, చందాపూర్, మల్కాపూర్, తుర్కల్ ఖానాపూర్, ముచ్చర్ల, వడ్డేపల్లి, చింతలచెరువు, నస్తీపూర్, కాసాల, గోవింద్‌రాజ్‌పల్లి తదితర గ్రామాల్లో 15కు పైగా భారీ పైవేట్ పరిశ్రమలు నిరంతరం కార్యకలాపాలు సాగిస్తున్నాయి. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాల వల్ల భూగర్భ జలాలు కలుషితమై తాగేందుకు గుక్కెడు మంచినీరు దొరకని దుస్థితి ఏర్పడింది. కాలుష్య కోరల్లో చిక్కుకున్న ఈ గ్రామాల్లో కనీస రహదారులు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, ప్రభుత్వ పాఠ శాలల్లో మౌలిక వసతులు, ప్రాథమిక వైద్య సదుపా యాల కల్పనకు ఈ సీఎస్ఆర్ నిధులను వినియో గించాల్సి ఉండగా.. యాజమాన్యాలు మొండిచేయి చూపుతున్నాయి.



సీఎస్ఆర్ లెక్కలు తేలాలి..

మండలంలో ఏర్పాటైన పరిశ్రమలు గత కొన్నేళ్లుగా ఎన్ని కోట్ల రూపాయల సీఎస్ఆర్ నిధులను కేటాయించాయి? అందులో వాస్తవంగా ఖర్చు చేసిన మొత్తం ఎంత?ఏయే గ్రామాల్లో ఏపనుల కోసం ఖర్చు పెట్టారు?స్థానికగ్రామాల పేరిటలెక్కలు రాసి పక్కదారి పట్టించారా? అనే సమగ్ర వివరాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని స్థానికులు పట్టుబడు తున్నారు. ప్రభుత్వం భూములు కేటాయించి, పరిశ్ర మల ఏర్పాటుకు అన్ని అనుమతులు, రాయితీలు కల్పించినప్పుడు.. స్థానిక సమాజానికి తిరిగి ఇవ్వాల్సిన సామాజిక బాధ్యతను కంపెనీలు ఎలా విస్మరిస్తాయని ప్రజలు నిలదీస్తున్నారు.

జిల్లా కలెక్టర్ సమీక్ష చేపట్టాలి..

హత్నూర మండలంలోని పరిశ్రమల సీఎస్ఆర్ నిధుల కేటాయింపులపై జిల్లా అధికార యంత్రాంగం తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. జిల్లా కలెక్టర్, జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారులు మండలంలోని అన్ని పరిశ్ర మల ప్రతినిధులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహిం చాలి. కాలుష్య ప్రభావానికి గురవుతున్న 12 గ్రామాల సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసి.. గ్రామాల అభివృద్ధికి పక్కా ప్రణాళికతో సీఎస్ఆర్ నిధులను ఖర్చు చేసేలా కఠిన ఆదేశాలు జారీ చేయాలని స్థానిక ప్రజలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేనిప క్షంలో పరిశ్రమల గేట్ల ఎదుట ప్రజా ఉద్యమాలు చేపడతా మని హెచ్చరిస్తున్నారు.

స్థానిక గ్రామాలకు కచ్చితంగా ప్రాధాన్యం ఇవ్వాల్సిందే..

పరిశ్రమలకు మా భూములు, మా నీరు, మా గాలి అవసరం.. కాలుష్యాన్ని మేమే భరించాల్సి వస్తుంది. సామాజిక బాధ్యత కింద వచ్చే అభివృద్ధి ప్రయోజనాల్లో స్థానిక గ్రామాలకు కూడా తగిన వాటా ఉండాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అభివృద్ధి ప్రయోజనాల్లో స్థానిక గ్రామాలకు కచ్చితంగా ప్రాధాన్యం ఇవ్వాల్సిందేనని, ఇదే హత్నూర మండల ప్రజల ప్రధాన డిమాండ్ అని స్పష్టం చేస్తున్నారు.